సంపుటి : 12 సంచిక : 39


RNI. NO. 67837/98. REGD. NO. HSE-726/2009-10, PRAJATANTRA Telugu Weekly

అక్టోబర్ 18 - 24, 2009


రూ. 5

# ప్రజాతంత్ర

సంపూర్ణ స్వతంత్ర వార పత్రిక



# 'హక్కు'ను కోల్పోయాం!



# బాలగోపాల్ మరో మహాత్ముడు

## పలువురి నివాళి

మానవ హక్కుల కోసం పోరాడిన మరో మహాత్ముడు కె. బాలగోపాల్ అహింస ఆయుధంగా శాంతిని కోరుకున్న మహాత్ముడు ఏ విధంగా పోరాటం సాగించాడో అదే విధంగా కడవరకు ప్రజల హక్కుల కోసం పోరాటం చేసిన మహనీయుడు, మహాత్మగాంధీ ఏ విధంగా ఐతే నిరాడంబరంగా ఉన్నారో అదేవిధంగా బాలగోపాల్ సామాన్యుదులో సామాన్యుడిగా బతికిన అసమాన్యుడని, ఆయన మరణంతో గరీబోల్లంత తమ హక్కుల్ని కాపాడే నేత లేదని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారని, పేదల హక్కులను కాపడటంలో వారు పిలవకున్న తమంతట తాముగా వెళ్లి వారికోసం వారికి న్యాయం జరిగేంత వరకు పోరాడే తత్వం ఉన్న బాలగోపాల్ లాంటి వ్యక్తులు అరుదని హెచ్ఎంటివి సిఇవో కె.రామచంద్రమూర్తి అన్నారు. ప్రముఖ న్యాయవాది కన్నాభిరాన్ మాట్లాడుతూ చరిత్ర పరిణామ క్రమంలో జరిగిన మార్పులకనుగుణంగా వ్యక్తులు తమ స్వభావాన్ని మార్చుకుంటున్నప్పటికీ బాలగోపాల్ వ్యవహారంలో ఎలాంటి మార్పు లేదని ముప్ఫై, నలభై ఏళ్లుగా పోరాటమె తన జీవితంగా పేదవాడి హక్కులను కాపాడటమే తన లక్ష్యంగా బతికారన్నారు. తాను నమ్మిందే నిజంగా నిబద్ధతతో నిజాయితీగా బతికిన మహోన్నత వ్యక్తి బాలగోపాల్ అని, అలాంటి వ్యక్తులు ఇప్పటి సమాజాన్ని సంస్కరించడానికి ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. తెరాస సిద్ధాంత కర్త ప్రొ॥ కొత్తపల్లి జయశంకర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఈ ప్రాంత ప్రజల ప్రాథమిక హక్కుగా గుర్తించి దానిపై పెక్కు వ్యాసాలు రాసిన బాలగోపాల్ తుదివరకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సిద్ధిస్తేనే ఇక్కడి ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పేవారని అన్నారు. ప్రత్యేక వాదం వల్ల ఎవరికీ నష్టం కలుగదని రాజకీయాలవల్లే ఈ అంశం వివాదాస్పదం అవుతుందని నిజానికి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా మారినట్లైతే ఎప్పుడో మిగతా ప్రాంతాలకంటే అభివృద్ధి చెందిందని బాలగోపాల్ అభిప్రాయపడేవారన్నారు. తెలంగాణ ప్రాంతంలో ఉన్న సిరిసంపదలని సక్రమంగా వినియోగంలోకి తెస్తే ఈ ప్రాంతం దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబడేదని బాలగోపాల్ అభిప్రాయపడేవారని అన్నారు. విప్లవ కవి వరవరరావు బాలగోపాల్‌తో తనకున్న అనుబంధ బాంధవ్యాలను నెమరువేసుకున్నారు. ఆయన గణిత శాస్త్రవేత్తగా దిట్ట అయినప్పటికీ ఉద్యమాలపట్ల ఆసక్తి పెంచుకొని తన జీవితాంతం పోరాటంలోనే గడిపిన మహావ్యక్తిగా ఆయన శ్లాఘించారు. ఒక పక్క విరసంలో పనిచేస్తూనే మరోపక్క హక్కుల సాదన కోసం ఎపిసిఎల్‌సిలో చేరి తను ఉద్యోగాన్ని త్యజించి ఫుల్‌టైం హక్కుల నేతగా ఉన్నారన్నారు. బాలగోపాల్ భిన్న పార్శ్వాలు కనిపించేవని తెలుగు సాహిత్యంలో వస్తున్న విభిన్న ధోరణులను ఆయన నిశితంగా పరిశీలించి సున్నితమైన విమర్శలు చేస్తూ వచ్చారని మరోపక్క ఉద్యమనేతగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారని ఆయన శాఘించారు. ప్రొ॥ హరగోపాల్ మాట్లాడుతూ బాలగోపాల్ లాంటి మానవహక్కుల నేత ఇంకెక్కడా కనిపించరని ఆయన లాంటి నిరాడంబరమైన జీవితాన్ని గడిపిన వ్యక్తి ఇప్పటి సమాజంలో ఉండరన్నారు.

❋

# ప్రజాతంత్ర
సంపూర్ణ స్వతంత్ర వారపత్రిక

సంపుటి : 12 సంచిక : 40

అక్టోబరు 18 - 24, 2009

● వ్యవస్థాపక సంపాదకులు :
దేవులపల్లి అమర్

● రెసిడెంట్ ఎడిటర్ :
పి. కరుణాకర్


● సబ్ ఎడిటర్ :
దేవులపల్లి అమిత

● కల్చరల్ రిపోర్టర్ :
పులివర్తి కృష్ణమూర్తి

● లేఅవుట్ & డిటిపి :
బి. సుజాత
జి. నరేష్
టి. అభినవ్

రిజిస్టర్డ్ & అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్:
ప్రజాతంత్ర హౌజ్,
ఇం.నెం 12-1-62,
విజయా గార్డెన్స్, బండ్లగూడ,
నాగోల్, రంగారెడ్డి జిల్లా-500068.
ఫోన్ : 20050456

**Edited, Printed and Published by**
Devulapalli Ajoy,
at PRAJATANTRA PRESS,
Plot No.15&16, H.No.12-1-62,
Vijaya Gardens, Bandlaguda,
Nagole, Ranga Reddy.
Ph : 20050456
Email: prajatantradaily@yahoo.com



❖ ప్రజాతంత్రకు ఇప్పుడెవరు రాస్తారు?
**దేవులపల్లి అమర్** ...5

❖ ఖాళీలను పూరించడమే సాహిత్యం పని
**కె.శ్రీనివాస్** ...8

❖ హింసపై మీమాంస
**మల్లేపల్లి లక్ష్మయ్య** ...14

❖ ఆయనొక 'గతితార్కిక' భూగోళం
**రాజన్న** ..17

❖ కవర్ కథనం
'హక్కు'ను కోల్పోయాం!
**యం. కోదండరామ్** ...18

❖ హక్కును నిర్వచించిన సిద్ధాంత కర్త
**శ్రీవత్స** ...23

❖ అక్షరాలా తీరని లోటు
**ఎన్. వేణుగోపాల్** ...24

❖ మహోన్నత వ్యక్తి బాలగోపాల్
**సి.హెచ్.వి. ప్రభాకరరావు** ...27

❖ నేటితరం గౌతమ బుద్ధుడు
**షహనాజ్** ...30

## కవితలు

చెకుముకీ!
**వఝుల శివకుమార్**
ఖాళీ మధ్య మనిషి
**వేముగంటి మురళీకృష్ణ** 34లో


అవిశ్రాంత హక్కు
**దాసరాజు రామారావు** ...35

రేపటి వెలుతురు
**సి.హెచ్.మధు** ...36

లోకానికి ఇచ్చిన నిర్వచనం
**పసునూరి రవీందర్** ...37

పావురం
**అన్నవరం దేవేందర్**
తలెత్తుకున్న ప్రశ్నల గొంతు
**తైదల అంజయ్య** 38లో


# బాలగోపాల్ మృతిపై ప్రముఖుల నివాళి



**మానవతా విలువల కోసం పోరాడిన యోధుడు :**

మానవతా విలువల కోసం జీవితాంతం పోరాడిన యోధుడు బాలగోపాల్.

– కె. రోశయ్య
(ముఖ్యమంత్రి)



**పౌర హక్కుల కోసం అవిరళ కృషి :**

పౌరహక్కుల రక్షణకు మూడు దశాబ్దాల పాటు అవిరళ కృషి చేసిన ప్రముఖ న్యాయవాది, పీడిత జన శ్రేయస్సు కోసం, మానవ హక్కుల కోసం ఉద్యోగాన్ని సైతం తృణప్రాయంగా వదిలేశారు.

– నారా చంద్రబాబునాయుడు
(తెదేపా అధ్యక్షుడు)



**జీవితాన్ని వెచ్చించారు :**

పీడితుల కోసం జీవితాన్ని వెచ్చించిన మానవతావాది. ఆయన మరణం ప్రజాతంత్ర ఉద్యమ కారులకు విఘాతం.

– కె. చంద్రశేఖరరావు
(తెరాస అధ్యక్షుడు నేత)



**పోరాట యోధుడు :**

బలహీన వర్గాల వారికి జరిగే అన్యాయాలపై నిరంతరం పోరాడారు. ప్రజల హక్కుల పరిరక్షణకు పాటుపడిన ఆయన మరణం ఉద్యమానికి తీరని లోటు.

– చిరంజీవి
(పీఆర్పీ అధినేత)

**మానవతా మూర్తి :**



సమాజంలో మెజారిటీగా ఉన్న ఆర్తుల కన్నీళ్ళు తుడవడానికి తన జీవితాన్నే వెచ్చించిన ఉద్యమకారుడు. బాలగోపాల్ పాటించిన విలువలు యువతకు స్ఫూర్తినిస్తాయి.

– జయప్రకాశ్ నారాయణ
(లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు)



**మార్క్సిస్ట్ మేధావి :**

పౌరహక్కులు, మానవ హక్కుల కోసం నిబద్ధతలో, నిర్భీతిగా పని చేసిన మార్క్సిస్ట్ మేధావి బాలగోపాల్


– సురవరం సుధాకరరెడ్డి
(సిపిఐ)



**రాజ్యహింసను ఎలుగెత్తి చాటాడు :**

రాజ్యహింస గురించి ఎలుగెత్తి చాటిన మహానేత, అది చావుతో చెలగాటం ఆడటమేనని తెలిసి కూడా ముందుకు సాగారు.


– గద్దర్
(ప్రజా గాయకుడు)



**ఉద్యమకారుడిని కోల్పోయాం :**

రాష్ట్రం గొప్ప ఉద్యమకారుడిని కోల్పోయింది.

– ఈటెల రాజేందర్
(తెరాస)




**దేవులపల్లి అమర్**

(రచయిత ప్రజాతంత్ర వ్యవస్థాపక సంపాదకుడు,
ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి అధ్యక్షుడు)

# ప్రజాతంత్రకు ఇప్పుడెవరు రాస్తారు?

**"ప్రజాతంత్రకు ఏమైనా రాయండి అని అడిగితే మొహం చాటేసిన వాళ్లూ ఉన్నారు. రెమ్యునరేషన్ ఏమిస్తారు? అని అడిగినవాళ్లూ ఉన్నారు. స్వతంత్రంగా నిలబడటానికి 'ప్రజాతంత్ర' సాగించిన ప్రయత్నానికి చేయూతగా నిలిచి రచనలు చేసిన వాళ్లూ ఉన్నారు. ఐతే వేర్వేరు కారణాల వల్ల చాలా మంది ప్రజాతంత్రకు రాయడం మానేసారు. బాలగోపాల్ మాత్రం చివరి దాకా తన కాలమ్ 'నిగాహ్' కొనసాగించాడు. ప్రజాతంత్ర పాఠకులు ఆయన అభిప్రాయాలను ఇకపైన చదవలేరన్నది జీర్ణించుకోజాలని విషయం."**

**బా**లగోపాల్ ఆకస్మిక మరణం వల్ల దేశంలోని ప్రజాతంత్ర ఉద్యమాలకు మానవ హక్కుల ఉద్యమాలకు ఎంత తీరని నష్టం జరిగిందో 'ప్రజాతంత్ర' అనే "చిన్న" వార పత్రికకు అంత కంటే ఎక్కువ నష్టం జరిగింది.

హంగులూ ఆర్భాటాలూ కోట్లాది రూపాయల పెట్టుబడులూ లేకుండా ప్రారంభమై దాదాపు 12 సంవత్సరాలుగా అన్ని కష్టాలూ ఎదుర్కొని ఆగకుండా నడుస్తున్న పత్రిక ప్రజాతంత్ర. పత్రిక ప్రారంభమైన మొదటి నెల నుంచే (బహుశా 1998 జనవరి లేదా ఫిబ్రవరి నెల) బాలగోపాల్ కాలమ్ **'నిగాహ్'** ప్రజాతంత్రలో రాయడం ప్రారంభించారు.

అప్పట్లో ప్రజాతంత్ర సంపాదకుడిగా నేనే ఆయనను అడిగాను పత్రికకు ఒక కాలమ్ రాయండి అని. ఆయనను అడిగినట్టే మరికొందరు పెద్దలను కూడా అడిగాను. కొందరు రాస్తామని ముందుకు వచ్చారు. మరికొందరు ఎంతకాలం నడుస్తుందిలే పత్రిక స్థిరపడనీ అప్పుడు ఆలోచిద్దాం అన్నారు. రాయడానికి ముందుకొచ్చిన వాళ్లలో కూడా కొందరు అనేక కారణాల వల్ల మధ్యలో మానేసారు.

ఒక్క బాలగోపాల్ మాత్రమే ప్రజాతంత్రకు తాను కాలమ్ రాయడం ప్రారంభించినప్పటి నుంచి చనిపోయే పదిహేను రోజుల ముందు దాకా ఏ ఒక్కసారీ ఆపకుండా ప్రజాతంత్రకు తన కాలమ్ **'నిగాహ్'** రాసాడు. తీరిక లేనంత పనిలో ఉండి



కూడా రాష్ట్రమంతటా తిరుగుతూ ప్రజల సమస్యల మీద చేస్తున్న ఉద్యమం ఒత్తిడిలో ఉండి కూడా ఆయన ప్రజాతంత్రకు పదిహేను రోజులకోసారి కాలమ్ రాయకుండా ఉండలేదు. ఏదో ఒక విధంగా కాలమ్ ప్రజాతంత్రకు చేరేట్టు చూసేవాడు.

ఈ పన్నెండేళ్ల కాలంలో ఆయన ప్రజాతంత్రలో తన కాలమ్‌లో బహుశా తడమని అంశం లేదు. మొదట్లో నేను కాలమ్ రాయాలని కోరినప్పుడు ఏం రాయమంటావు? అని అడిగాడు. మీ ఇష్టం మీరు ఏది రాసినా సరే అన్నాను. రాయడం మొదలు పెట్టాడు, ఎక్కడా ఆపలేదు.

బాలగోపాల్ చనిపోయిన రోజు ఆయన ఇంటి దగ్గరనే అనుకుంటా ఒక మిత్రుడు అజయ్ (ప్రస్తుత ప్రజాతంత్ర సంపాదకుడు) తో చెప్పిన మాటలు ఏ విషయంలోనైనా సరే అది ఎంత చిన్నదైనా సరే బాలగోపాల్ కమిట్‌మెంట్‌ను గుర్తు చేస్తాయి. చనిపోయే కొద్ది రోజుల ముందు బాలగోపాల్ ఏ తెల్లవారుఝామునో ఆ మిత్రుడి ఇంట్లో కిటికీ నుంచి ఓ కవర్ జారవిడిచి వెళుతుంటే మెళకువగానే ఉన్న అతను తలుపు తెరిచి ఏమిటి అట్లా వెళ్లిపోతున్నారని అడిగితే అర్జెంట్‌గా ఊరు వెళ్లాలి, ప్రజాతంత్రకు నా కాలమ్ అందజేయండి అని చెప్పి వెళ్లిపోయాడట. ఒక వారం ప్రజాతంత్రకు కాలమ్ రాయకపోతే అడిగేవాళ్లు లేరు, కానీ ఆయన కమిట్‌మెంట్ అటువంటిది.

మొన్న 12వ తేదీన బాలగోపాల్ సంస్మరణ సభ రోజు ఉదయం మరో మిత్రుడు కోదండ్ (ప్రొఫెసర్ కోదండరామ్, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షులు) నేను "కాఫీ విత్ సాక్షి'' ఉదయం కార్యక్రమంలో కలుసుకున్నప్పుడు ప్రజాతంత్రకు బాలగోపాల్ రాసిన కాలమ్ ప్రస్తావన వచ్చింది. అప్పుడు కోదండ్ జ్ఞాపకం చేసుకున్న మాటలు పెద్ద పెట్టుబడులకు నోచుకోక కమిట్‌మెంట్‌తో నడిచే పత్రికల పట్ల బాలగోపాల్ కన్‌సర్న్‌ను గుర్తు చేస్తాయి.

చాలా మంది బాలగోపాల్‌తో అనేవాళ్లు ప్రజాతంత్రలో మీరు రాస్తున్న కాలమ్‌లో చాలా వైవిధ్యం ఉంది. అనేక విషయాల మీద మీ విశ్లేషణ, అభిప్రాయం తెలుస్తున్నది, కానీ ప్రజాతంత్ర లో రాస్తే ఎక్కువ మంది చదవరు కదా ఏదైనా పెద్ద పత్రికకు రాయరాదా అని. అప్పుడు బాలగోపాల్ ఈ పత్రికలకే రాయాలి, మనం రాయకపోతే ఇటువంటి పత్రికలకు ఎవరు రాస్తారు? అని చెప్పారు. ఈ విషయం కోదండ్ చెప్పాడు నాకు.

ప్రజాతంత్రకు ఏమైనా రాయండి అని అడిగితే మొహం చాటేసిన వాళ్లూ ఉన్నారు. రెమ్యునరేషన్ ఏమిస్తారు? అని అడిగినవాళ్లూ ఉన్నారు. స్వతంత్రంగా నిలబడటానికి 'ప్రజాతంత్ర' సాగించిన ప్రయత్నానికి చేయూతగా నిలిచి రచనలు చేసిన వాళ్లూ ఉన్నారు. ఐతే వేర్వేరు కారణాల వల్ల చాలా మంది ప్రజాతంత్రకు రాయడం మానేసారు. బాలగోపాల్ మాత్రం చివరి దాకా తన కాలమ్ **'నిగాహ్'** కొనసాగించాడు. ప్రజాతంత్ర పాఠకులు ఆయన అభిప్రాయాలను ఇకపైన చదవలేరన్నది జీర్ణించుకోజాలని విషయం.

మధ్యలో ఒక్కసారి బాలగోపాల్ కాలమ్ అందలేదు. ఏం జరిగిందోనని వసంతకు ఫోన్ చేసాను. 'నాకు తెలియదయ్యా ఆయన రాయనంటున్నారు, ఆయనతోనే మాట్లాడుకో' అన్నది.

అదే సాయంత్రం ఆనంద్ నగర్‌లో ఆయన ఇంటికి వెళ్లాను. ఇద్దరు, ముగ్గురు క్లయింట్‌లు ఉన్నారు. అప్పుడే కోర్టు నుండి వచ్చినట్టున్నాడు. బాలగోపాల్ దగ్గర నాకు ఎంత చనువు ఉందో ఆయనంటే అంత భయం కూడా.

కొందరితో అంతే. వాళ్లు నిర్వహిస్తున్న ఉద్యమాలతో, వాళ్లు నాయకత్వం వహిస్తున్న లేదా ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థల్లో సభ్యుడిగా లేకున్నా వాళ్ల కట్టుబాట్లు, క్రమశిక్షణల పరిధిలోకి రాకున్నా, ఒకళ్లిద్దరంటే నాకు ఆ భయం వాళ్ల పట్ల ఉన్నా గౌరవం, అభిమానం వల్లనే అనుకుంటాను. అటువంటి వాళ్ల కోవలోకి వచ్చే వ్యక్తి బాలగోపాల్.

ఏందిట్లా వొచ్చినావ్ అన్నాడు బాలగోపాల్. జంకుతూనే మాట్లాడాలె అన్నాను. క్లయింట్‌లను మాట్లాడి పంపించేసాడు. ఏంటి సంగతి అంటే కాలమ్ రాయనన్నారట అన్నాను.

నువ్వు జియర్ స్వామిని తీసుకొచ్చి పత్రిక ఫంక్షన్ చేస్తుంటే నేనెందుకు రాయాలి? అన్నాడు. నాకు ఇది తట్టనే లేదు. అంతకు కొద్దిరోజుల ముందే ప్రజాతంత్ర హైదరాబాద్ నగరంలో సాయంకాలం దినపత్రికగా తీసుకొస్తే బాగుంటుందనే ఆలోచన ప్రజాతంత్ర యాజమాన్యానికి వచ్చింది. ఆ సాయంకాలం పత్రికను చిన జియర్ స్వామి ఒక ఫంక్షన్‌లో ఆవిష్కరించారు.

> **“ చాలా మంది బాలగోపాల్‌తో అనేవాళ్లు ప్రజాతంత్రలో మీరు రాస్తున్న కాలమ్‌లో చాలా వైవిధ్యం ఉంది. అనేక విషయాల మీద మీ విశ్లేషణ, అభిప్రాయం తెలుస్తున్నది, కానీ ప్రజాతంత్రలో రాస్తే ఎక్కువ మంది చదవరు కదా ఏదైనా పెద్ద పత్రికకు రాయరాదా అని. అప్పుడు బాల గోపాల్ ఈ పత్రికలకే రాయాలి, మనం రాయకపోతే ఇటువంటి పత్రికలకు ఎవరు రాస్తారు? అని చెప్పారు. ఈ విషయం కోదండ్ చెప్పాడు నాకు. ”**

బాలగోపాల్ కాలమ్ ఆపేస్తాననడానికి ఇదీ కారణమని నాకు తట్టనే లేదు. ఏం చెయ్యాలో తెలియక మౌనంగా కూర్చున్నాను. ఆయనే కల్పించుకుని సరే రాస్తాను, కానీ ఈ వారం చిన్న జియ్యర్ స్వామిని విమర్శిస్తూ రాస్తే వేసుకుంటావా అన్నాడు. ‘తప్పకుండా’ అన్నాను. ప్రజాతంత్రలో ఆ సమస్య ఎప్పుడూ లేదు. అన్ని అభిప్రాయాలూ ప్రజలకు చేరాలన్నదే ఆ పత్రిక అభిమతం.

అయితే, మరెందుకో గాని బాలగోపాల్ తాను అన్నట్టుగా జియ్యర్ స్వామికి వ్యతిరేకంగా ఏమీ రాయలేదు. ఆ తరువాత ఎప్పుడూ ఆయన కాలమ్ ఆగలేదు. సాహిత్యం మీద ఆయన అభిప్రాయాలకు సంబంధించిన చివరి ఇంటర్వ్యూ కూడా ప్రజాతంత్రలోనే వచ్చింది.

దాదాపు ఎనిమిది సంవత్సరాల క్రితం ప్రజాతంత్ర ప్రచురించిన ఒక ప్రత్యేక సాహిత్య సంచికలో బాలగోపాల్‌ను ప్రస్తుత ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ ఇంటర్వ్యూ చేసారు.

ఆయన ఆకస్మిక మరణం కారణంగా **‘నిగాహ్’** కాలమ్ ఆగిపోవడాన్ని మించిన బాధాకరమైన విషయం నా వరకు నాకు ఇంకొకటి ఉండదు.

దాదాపు 250 వారాలు ఆయన కాలమ్ నడిచింది ప్రజాతంత్రలో. ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లి (ఇపిడబ్ల్యూ) వంటి గొప్ప పత్రికల వాళ్లే అడిగి రాయించుకునే స్థాయి బాలగోపాల్‌ది. ఆయనకు మాత్రం అవేమీ పట్టవు. ఆ తేడాలు ఆయనకు ఉండవు. అందుకే మనం రాయకపోతే ప్రజాతంత్రకు ఎవరు రాస్తారు? అని ప్రశ్నించాడు.

నిజానికి, కొంతకాలంగా బాలగోపాల్ ప్రజాతంత్రలో చేసిన రచనలన్ని పుస్తకంగా తీసుకు రావాలనే ఆలోచనలో మేం ఉన్నాం. అందుకు అవసరమైన సహకారం అందించడానికి వసంత ముందుకు వచ్చింది. కొన్ని వారాలు మ్యాటర్ కంపోజ్ చేయడం, ప్రూఫ్‌లు చూడటం, మిస్సింగ్‌లను సరిచేయడం వంటి పనులు కూడా చేసింది వసంత.

ఇప్పుడు ఆయన లేడు ఆయన రచనలు ఉన్నాయి. వాటిలో ఆయన ఆలోచనలున్నాయి, అభిప్రాయాలున్నాయి, ప్రజల హక్కుల రక్షణ పట్ల ఆయన ఆకాంక్షలున్నాయి.

ఆయన రచనల ప్రచురణ ద్వారా వాటన్నిటిని మరింత మంది ప్రజల దగ్గరకు చేర్చే ప్రయత్నం ద్వారా ప్రజాతంత్ర ఆయనకు నివాళులు అర్పించదల్చుకున్నది.


ప్రజాతంత్ర కుటుంబం తరఫున బాలగోపాల్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

*

**(వ్యక్తిగతంగా, జర్నలిజం వృత్తిపరంగా, జర్నలిస్ట్ ఉద్యమ కార్యకర్తగా నాకు మానవ హక్కుల మహనీయ నేత బాలగోపాల్‌తో ఉన్న అనుబంధాన్ని గురించి వచ్చే వారాల్లో తప్పక రాస్తాను.)**

ఇంటర్వ్యూ: కె.శ్రీనివాస్

('ప్రజాతంత్ర' సాహిత్య ప్రత్యేక సంచిక -
మార్చి 2001 నుంచి పునర్ముద్రితం)



"మార్క్సిజంపై అసంతృప్తితో తాను మొదలు పెట్టిన తాత్విక అన్వేషణ ఒక కొలిక్కి వచ్చిందనీ, తనకు సంతృప్తినిచ్చే ప్రాపంచిక దృక్పథం ఏర్పడిందనీ బాలగోపాల్ ఈ ఇంటర్వ్యూలోనే ప్రకటించారు. ఆ దృక్పథం ఏమిటో సాహిత్యాంశాల అన్వయంతో ఆయన సూచనప్రాయంగా చెప్పారు. ఎనిమిదేండ్ల కిందట జరిగిన ఈ సంభాషణ - బహుశా బాలగోపాల్ ఇచ్చిన చివరి పూర్తి సాహిత్య ఇంటర్వ్యూ...."

# ఖాళీలను పూరించడమే సాహిత్యం పని

## ఏడు సంవత్సరాల క్రితం ఒక సాహిత్య వ్యాసం ద్వారా మార్క్సిజం మీద తన తాత్విక అసంతృప్తిని చర్చకు పెట్టి తీవ్రమైన సంచలనాన్ని, వివాదాన్ని సృష్టించిన

# కె.బాలగోపాల్

## తెలుగు సాహిత్యరంగంలో ఇప్పటిదాకా స్థిరపడి వున్న అనేక మౌలిక భావనలను ఈ ఇంటర్వ్యూ ద్వారా పూర్వపక్షం చేస్తున్నారు.

**ప్ర** చరిత్ర, మనిషి, మార్క్సిజం – అన్న మీ సుప్రసిద్ధ వ్యాసం (అరుణతార, సెప్టెంబర్ 1993) 'రాగో' అన్న నవలకు సమీక్షగా రాశారు. ప్రధానంగా సాహిత్య విమర్శ వ్యాసంగా వచ్చిన ఆ రచనలో రాజకీయ అంశే సంచలనాన్ని, వివాదాన్ని సృష్టించింది తప్ప, దానిలోని సాహిత్య చర్చనీయాంశాలను ఎవరూ పట్టించుకోలేదు. మీరు ప్రతిపాదించిన లేదా చర్చించిన సాహిత్య అంశాలు కూడా 'రాజకీయ' అంశాలంత వివాదాస్పదమైనవి. ప్రతిస్పందనలోని ఆ విశేషాన్ని మీరు ఎలా వ్యాఖ్యానిస్తారు?

అది సమీక్షగా రాసింది కాదు. ముందుమాటగా రాసింది. రచయిత విశ్వాసాలకు పూర్తిగా భిన్నమైన రచనను ముందుమాటగా వేయడం భావ్యం కాదనిపించి, 'రాగో'కు ముందుమాటగా కాకుండా విడిగా వ్యాసంగా అచ్చు వేయదలచుకుంటే వేయమని చెప్పాను. అందువల్ల అది 'అరుణతార'లో వ్యాసంగా అచ్చయింది. స్పందన మాటకొస్తే, రచనకు తాత్వికంగా స్పందించి ఉంటే అన్ని అంశాలు చర్చకు వచ్చేవేమో, కానీ తమ రాజకీయ విశ్వాసాలపైన దాడిగా దానిని భావించి స్పందించినవారే ఎక్కువ కాబట్టి చర్చ ఆ విధంగా జరిగిందనుకోవాలేమో. అయినా ఆ వ్యాసం నా అభిప్రాయాల సమగ్ర వ్యక్తీకరణ కాదు. అప్పటికి దాదాపు మూడేళ్లుగా నా తాత్విక విశ్వాసంగా నేనప్పటిదాకా భావిస్తూ వచ్చిన మార్క్సిజం పట్ల నాకు అసంతృప్తిగా ఉండింది. దానికి సమాధానం చెప్పగలగడం సంగతి అటుంచి, ఆ అసంతృప్తిని స్పష్టంగా నాకు నేను వివరించుకోలేకపోవడం వల్ల రాయడమే మానేసాను (పౌర హక్కుల రిపోర్టులు తప్ప). ఆ దశలో నేను చేసిన మొదటి రచన ఆ వ్యాసం. ముందుమాట కుండే పరిమితులే కాక ఈ పరిమితి కూడా దానికి ఉంది. అందువల్ల ఆ వ్యాసంలోని అభిప్రాయాలను వివరించే పద్ధతిలో కాకుండా మీ ప్రశ్నలకు విడిగానే జవాబు చెప్పే ప్రయత్నం చేస్తాను. ఆనాడు నేను మొదలుపెట్టిన తాత్విక అన్వేషణ ఒక కొలిక్కి వచ్చిందనీ నాకు సంతృప్తి ఇచ్చే ప్రాపంచిక దృక్పథం నాకిప్పుడుందనీ అనుకుంటున్నాను.

**ప్ర** సోషలిజం, సమ సమాజం అన్న ఆదర్శాలే సంక్షోభంలో పడిన కాలంలో, ఆ ఆదర్శాల ఆధారంగా నిర్మించుకున్న అనేక సాహిత్య భావనలు, సిద్ధాంతాలు తెలుగు సాహిత్య రంగంలో చర్చకు ఎందుకు రావడం లేదు?

ఇతర సోషలిస్టు సాహిత్య భావనలు, సిద్ధాంతాల సంగతి పోనిచ్చి కనీసం మార్క్సిస్టు సంప్రదాయంలోని సాహిత్య సిద్ధాంత భావనలు సహితం అన్నీ చర్చకు రాలేదు. మన దగ్గర 'అరసం'తో మొదలుపెట్టి 'విరసం' వాళ్లు కొనసాగించిన సాహిత్య సంప్రదాయం కంటే చాలా భిన్నమైన ఆలోచనలు మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంత సంప్రదాయంలోనే ఉన్నాయి. రేమాండ్ విలియమ్స్, అడార్నో వంటివారు చారిత్రక భౌతిక వాదం ప్రాతిపదిక వివరమైన సాహిత్య సిద్ధాంతాలు

రూపొందించారు. వాటితో మన దగ్గరున్న వామపక్ష సాహిత్యకారులకు పరిచయం ఉంటే రెండు రకాలుగా ప్రయోజనం ఉండేది. ఒకటి ప్రామాణిక మార్క్సిస్టు సాహిత్య విమర్శగా మనదగ్గర చలామణి అయ్యే విమర్శ ఆమోదించని కొన్ని సాహిత్య ప్రయోగాలకు వస్తు సంబంధమైనవీ శిల్ప సంబంధమైనవీ కూడా మార్క్సిస్టు సంప్రదాయంలోనే ఆమోదమే కాక ప్రశంస కూడా ఉందని తెలిసేది. సాహిత్యానికి, ప్రజలకు విప్లవోత్తేజం కలిగించడం అనే ఒకే ఒక కర్తవ్యానికి పరిమితమైన పాత్ర కాక, విస్తృతమైన పాత్ర కల్పించే సాహిత్య సిద్ధాంతాలు మార్క్సిస్టు సంప్రదాయంలోనే ఉన్నాయని తెలిసేది. రెండు మన దగ్గర ప్రచారంలో ఉన్నదాని కంటే సంపన్నమైన సాహిత్య సిద్ధాంతాలకు చారిత్రక భౌతికవాదంలో స్థానం ఉన్నప్పటికీ మార్క్సిజం ప్రాతిపదికన పరిపూర్ణమైన సాహిత్య సిద్ధాంతం రూపొందించడం సాధ్యం కాదని కూడా అర్థమై ఉండేది. ఈ సిద్ధాంతాలు మన దగ్గర చర్చకు రాకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. జీవిత మూలాలకు సంబంధించిన సత్యాన్వేషణ ఇంకా బాకీ ఉందని మన దగ్గర మార్క్సిస్టులు అనుకోవడంలేదు. అది ప్రాథమికంగా ముగిసిందనీ దానిని ఆచరించడం, అన్వయించడం, మెరుగులు దిద్దడం మాత్రమే మిగిలి వుందనీ అనుకుంటున్నారు. కనీసం 20వ శతాబ్దపు చివరి దశకం లోనయినా ఈ అభిప్రాయం మారవలసి ఉండింది. మారి ఉంటే సోషలిజానికి సంబంధించిన అన్ని ఆలోచనలనూ తిరిగి అధ్యయనం చేయడం జరిగి ఉండేది. అది తత్వశాస్త్రంలో జరగలేదు. రాజకీయాలలో జరగలేదు. సాహిత్యంలోనూ జరగలేదు.

**ప్ర** రచయిత లేదా కవి తన రచనలో ఎటువైపు నిలబడ్డాడు అన్న కొలమానం గొప్ప సాహిత్యాన్ని గ్యారంటీ చేయలేదని మీరు అన్నారు. మరి ఆ కొలమానానికీ ఎటువంటి ప్రయోజనమూ సార్థకతా లేవా?

ఎటువైపు నిలబడ్డారనేది గొప్ప సాహిత్యాన్ని గ్యారంటీ చేయలేదని నేను చెప్పనవసరం లేదు. అది అందరికీ తెలిసిన సత్యమే. మరి పక్షపాతానికి ఏ ప్రయోజనమూ లేదా అంటే, పూర్తిగా అన్యాయాన్ని సమర్థించే దృక్పథం నుండి గొప్ప సాహిత్యం పుట్టదు అని చెప్పవచ్చు. న్యాయానికి కంకణబద్ధమైన దృక్పథం నుండి పుట్టే సాహిత్యం ఒకవేళ సాహిత్యంగా రాణించకున్నా సాధారణంగా ఏవగింపు కలగించదు. అన్యాయానికి (దీనికి కూడా మినహాయింపులు లేకపోలేదు) కంకణబద్ధమైనది ఏవగింపు కలిగిస్తుంది కాబట్టి సాహిత్యంగా రాణించదు. అయితే అన్యాయాన్ని పూర్తిగా భుజానికెత్తుకునే రచయితలు చాలా కొద్దిమందే ఉంటారు. కాబట్టి ఇది పెద్దగా జ్ఞానదాయకం కాదు. ఏ విషయంలోనయినా ఏది న్యాయం ఏది అన్యాయం అనేది కచ్చితంగా తెలుసుకోగలమనీ, న్యాయం వైపు ఉన్నావా లేక అన్యాయం వైపు ఉన్నావా అన్న ప్రశ్నకు అన్ని సందర్భాలలోనూ కచ్చితమైన జవాబు చెప్పగలమనీ, సాహిత్యంతో సహా అన్ని విషయాలలోనూ ఈ జవాబే ప్రధాన (నిర్ణయాత్మక) విషయమనీ నమ్మినట్టయితేనే మీరు వేసినది సాహిత్య విమర్శకు కీలకమైన ప్రశ్న. లేకపోతే అది ఒకానొక ప్రశ్న మాత్రమే.

**ప్ర** రచన ఎందుకోసం చేస్తారు? కళ కళకోసమా, ప్రజల కోసమా అన్న ప్రశ్నకు ఇప్పుడు అర్థముందా? సాహిత్యానికి దాని కర్తకూ ఉండే సంబంధం ఏమిటి? రచయిత సాహిత్యాన్ని మరేదయినా ఆశయం కోసం రాయడం సరి అయినదేనా? సాహిత్యానికీ దాని పాఠకులకూ ఉండే సంబంధం ఏమిటి? సాహిత్యం బోధించాలా, జనాన్ని సమీకరించాలా, వినోదాన్నో ఆహ్లాదాన్నో ఇవ్వాలా? ఆయా సంబంధాలకు స్థిర నిర్వచనం ఇవ్వగలమా?

కళకూ సాహిత్యానికీ ఒక కర్తవ్యాన్ని నిర్దేశించే ముందు అవి మానవ జీవితంలో ఏ పాత్ర నిర్వహించాయో చూడడం ఉచితంగా ఉంటుంది. ఇది కామన్‌సెన్స్ విషయమేగానీ సాహిత్యం పాత్ర ఇది అది అంటూ తాఖీదులు జారీ చేసే వాళ్ళకిది తోచినట్టు కనిపించదు. కళా సాహిత్యాలు నాగరికత అంత ప్రాచీనమైనవి. సైకిల్ తొక్కడం లాగ, క్రికెట్ ఆడడం లాగ కళా సాహిత్య సృజన మనిషి చేయగల ఒకానొక పనికాదు. అవి మానవ అస్తిత్వ నైజంతో సన్నిహితంగా ముడివడిన ప్రక్రియలు. మనిషి ఉనికిలో అంతర్భాగమైన ప్రక్రియలు. రాళ్ళ నుండి పనిముట్లు తయారు చేసుకోవడం మొదలు పెట్టిననాడే రాతి గోడల పైన బొమ్మలు వేయడం, రాళ్లతో కళాత్మకమైన వస్తువులు తయారు చేయడం మనుషులు మొదలుపెట్టారు. మనిషి రాత నేర్చిననాడే సాహిత్యం కూడా పుట్టింది. గానం అంతకంటే ముందే పుట్టింది.



## ఆనాడు నేను మొదలుపెట్టిన తాత్విక అన్వేషణ ఒక కొలిక్కి వచ్చిందని, నాకు సంతృప్తి ఇచ్చే ప్రాపంచిక దృక్పథం నాకిప్పుడుందని అనుకుంటున్నాను

మానవ జీవితంతో ఇంతగా పెనవేసుకున్న కళాసాహిత్యాలకు ఆ జీవితంలో ఉన్న పాత్ర ఏమిటో అర్థం చేసుకోకుండా వాటికి నియమాలూ తాఖీదులూ జారీ చేయడం ఎంతవరకు సబబు?

కళ సంగతి పక్కనపెట్టి సాహిత్యం గురించి మాట్లాడుకుందాం. దేనికయినా ఒక్క వాక్యంలో నిర్వచనం ఇవ్వడంలో సమస్యలున్నాయి గానీ సాహిత్యం పాత్రను ఒక్క వాక్యంలో నిర్వచించమంటే, జీవితంలోని ఖాళీలను పూర్తిచేయడం సాహిత్యం పాత్ర అని చెప్పవచ్చు. దానికి వేరే ఏ కర్తవ్యాన్ని అప్పగించడంలోనూ అర్థం లేదు. ఆ కర్తవ్యాన్నే సమ సమాజ లక్ష్య సాధన దిశగా మలచుకునే ప్రయత్నం చేయొచ్చు. జీవితంలో ఖాళీలు ఎందుకుంటాయి? చైతన్యయుతంగా బతకాలనే 'శాపం' మనిషికి లేనట్టయితే జీవితంలో ఖాళీలు ఉండవు. ఇతర జంతువులు ఒక జంతు జాతిగా తమకు ఉండే జన్యు లక్షణాలననుసరించి బతుకుతాయి. వాటికి తెలివిలేదనీ రోబోట్‌ల వంటివనీ కాదు. ఎంత చురుకయిన మెదడున్న జంతువయినా తన పరిసరాలతో తాను ఏ విధంగా వ్యవహరించాలన్న నిర్ణయాన్ని తన జన్యు లక్షణాలు నిర్ణయించే ఖచ్చితమైన పరిధిలోపలే తీసుకుంటుంది. చాలా సందర్భాలలో జన్యు స్వభావమే ఆ నిర్ణయాన్ని చేసి పెడుతుంది. మనిషిలో జన్యు నిర్ణాయకత చాలా తక్కువ. తన పరిసరాలతో – అందులో భాగంగా ఇతర మనుషులతోనూ – ఏ విధంగా వ్యవహరించాలన్న నిర్ణయాన్ని నూటికి తొంభై తొమ్మిదిపాళ్లు మనిషి చైతన్యయుతంగానే తీసుకోవాలి. ఇది మనిషి అస్తిత్వ నైజంలోని ప్రధాన అంశం. ప్రతీ మనిషీ తనలో పుట్టిన 'స్వంత' చైతన్యంతోనే ఈ నిర్ణయాలు తీసుకుంటారని కాదు. ఆ చైతన్యం అప్పటికే ఒక సామాజిక ఆలోచనారీతి చేత ప్రభావితమయి వుంటుంది. అయినప్పటికీ నిర్ణయం చైతన్యయుతమైనది.

చైతన్యయుతంగా వ్యవహరించడమంటే ఏది చేయాలో ఎంచుకోవడం, ఏ విధంగా వ్యవహరించాలన్న ఎంపిక చేసుకోవడం. మనం వ్యవహరించే వస్తువులు, విషయాల గురించి కూడా అభిప్రాయాలు ఏర్పరచుకోవడం, అందులో భాగంగా మన గురించి కూడా అభిప్రాయాలు ఏర్పరచుకోవడం. అప్పుడు సహజంగానే ప్రమాణాలు ఏర్పడతాయి. ఇది మనిషి అస్తిత్వ నైజంలోని రెండవ అంశం. ప్రామాణికతా భావన మనిషి చైతన్యానికి ఉండే స్వాభావిక లక్షణం. నైతికత (తప్పొప్పులు, మంచి చెడుల భావన) అందులో ఒక భాగం మాత్రమే. దానితో పాటు అన్నిటికీ ప్రమాణాలు ఏర్పడతాయి. సౌందర్యం, సంతోషం, సుఖం, సంతృప్తి మొదలైన అన్నిటికీ ప్రమాణాలు ఏర్పడతాయి. ప్రామాణికతా భావన వెంటనే పరిపూర్ణతా భావన కూడా ఉంటుంది. ఇది దానిని వెన్నంటి ఉంటుంది. సంపూర్ణమైన మంచి, సంపూర్ణమైన సుఖం, సంపూర్ణమైన సౌందర్యం, సంపూర్ణమైన సాహసం మొదలైనవన్నీ పరిపూర్ణతా భావనలో భాగమైనవే.

నిజ జీవితానికీ ఈ పరిపూర్ణతా భావనకూ మధ్యనున్న అంతరం జీవితంలోని ఖాళీలలో ఒకటి. అది కల్పించే దాహం సాహిత్యానికి గొప్ప దోహదకారి అయింది. అయితే పరిపూర్ణతా భావన ఒక్కటే కాదు, అన్ని రకాల ప్రామాణికతా భావనలను జీవితం వెక్కిరిస్తుంది. ఈ అంతరం మనిషిలో కలిగించే ఆందోళన, ఆవేదన, వెలితి అన్ని భాషలలోనూ సాహిత్యానికొక ముఖ్య వస్తువు.

జీవితంలో వేరే రకమైన ఖాళీలు కూడా ఉంటాయి. చైతన్యయుతంగా జీవించక తప్పని మనిషికి జ్ఞానం చాలా అవసరం. అయితే మన కళ్లముందు ఉండీ మనం చూడని, చూడజాలని విషయాలనేకం ఉంటాయి. కొన్ని భయం వల్ల చూడము. కొన్ని అభద్రత వల్ల చూడము. కొన్ని ఒక బలమైన భావజాలం ప్రభావం వల్ల మన ఎదుట ఉండీ మనకు కనిపించవు. ఒక్కొక్కసారి మనకు అలవడిన దృక్కోణం వల్లగానీ మనం ఎంచుకున్న దృక్కోణం వల్లగానీ కొన్ని విషయాలు కళ్ల ముందే ఉండీ కనిపించవు. వీటిలో విడివిడి విషయాలే కావు, సామాజిక క్రమాలు కూడా ఉంటాయి. వీటిని మనకు చూపించడం సాహిత్యం చేసే పనులలో ఒకటి. చూపించే క్రమంలో ఏ భయం, లేక ఏ అభద్రతా భావన, లేక ఏ భావజాలం, లేక ఏ పాక్షిక దృక్కోణం దీనిని మనం చూడలేకుండ చేసిందో కూడా సాహిత్యం చెప్పకుండానే చెప్తుంది. 'అరె! ఇది నాకు తెలిసిన విషయమే గానీ చూడలేకపోయానే' అనుకునేటట్టు చేస్తుంది. మంచి సాహిత్యమెప్పుడూ ఆ

అనుభూతి కలిగిస్తుంది. మానవ అస్తిత్వంలోని ఈ రకరకాల 'ఖాళీలు' సాహిత్యం జన్మస్థలం, దాని కార్యక్షేత్రం. అటువంటి ప్రక్రియ మనిషి అస్తిత్వ నైజం వల్లనే అవసరమయింది. సాహిత్యానికీ ఉండే ఈ నైజాన్ని గుర్తించి దానితో సమసమాజ ఆదర్శానికి అనుగుణంగా వ్యవహరించడం నేర్చుకోగలిగితే – దానికి ఏమైనా ప్రమాణాలు రూపొందించుకోగలిగితే – అది ప్రజాసాహిత్య సిద్ధాంతం కాగలదు. సోషలిస్టు సాహిత్య సిద్ధాంతం కాగలదు. 'కళ ప్రజల కోసం' అనే నినాదానికి వేరే ఏ కార్యరూపం ఇచ్చే ప్రయత్నం చేసినా అది సాహిత్యానికిగానీ ప్రజలకుగానీ మేలు చేయదు.

**ప్ర** నిలిచిపోయే సాహిత్యానికి – సమర్థవంతంగా రాయడం, సామాజిక పరిణామంలో కీలక స్థానంలో ఉన్న చారిత్రక సందర్భం నేపథ్యంగా ఉండడం – అన్న లక్షణాలను మీరు ప్రతిపాదించారు. ఎటువంటి బాహ్య పరిస్థితుల మధ్య అయినా తన సమర్థత, పక్షపాతాల ఆధారంతో రచయిత గొప్ప రచనలు చేయగలడని ఇంతకాలం నమ్ముతూ వచ్చాం. చారిత్రక సందర్భానికి మీరు ఎక్కువ వెయిటేజి ఇవ్వడం వల్ల నిలిచిపోయే రచనల సాధన నుంచి రచయితలను నిరుత్సాహపరుస్తుంది కదా?

సమర్థవంతంగా రాయడం సంగతి పక్కన పెట్టండి. అదెట్లాగూ అవసరమే. ఇక్కడ సామర్థ్యం అనేది శిల్పానికి సంబంధించినది. శిల్పం గురించి మాట్లాడితే వస్తువు మీద నుండి దృష్టి తొలగిపోతుందనే కృత్రిమమైన భయం నుండి బయటపడగలిగితే, సాహిత్యానికి 'సాహిత్యం' లక్షణం ఇచ్చేది శిల్పమే తప్ప వస్తువు కాదనే విషయం స్పష్టమే. సాహిత్యానికీ జర్నలిజానికీ తేడా సాహిత్య శిల్పమే. సాహిత్యాన్ని శిల్పమే రూపొందిస్తుంది. (Form is Constitutive of literature) అని అడార్నో అంటాడు. అతను వర్గపోరాటం మీద అచంచల విశ్వాసం ఉన్న మార్క్సిస్టే మళ్లీ.

కీలకమైన సామాజిక పరిణామాల మాటకొస్తే, అటువంటి సందర్భాలు చరిత్రలో ఎక్కడ తలెత్తినా గొప్ప కథా వస్తువులు అందించడానికి ఒక కారణం ఉంది. అటువంటి సందర్భాలలో ఒక్కొక్కసారి మానవ ఆలోచనారీతికి స్వాభావికమైన పరిపూర్ణతాభావన, ప్రామాణికతా భావన అత్యున్నత స్థాయిని అందుకుంటాయి. అతి గొప్ప ఆదర్శాలు ముందుకొస్తాయి. ఒక్కొక్కసారి మానవ ఆచరణ అతి నీచ స్థాయికి పడిపోతుంది. ఒక్కొక్క సారి రెండూ జరుగుతాయి. అన్ని సందర్భాలలోను ఉన్నత ప్రవర్తనకూ నీచమైన ప్రవర్తనకూ మధ్యనున్న ఎడం మరింత ఎక్కువవుతుంది. చూడగలిగి ఉండీ చూడలేకపోవడం, కళ్ల ముందుండీ కళ్లు మూసుకుపోయి కనిపించకపోవడం అటువంటి చారిత్రక సందర్భాలలో మరింత స్పష్టంగా తెలుస్తాయి. సాహిత్యం కార్యక్షేత్రమైన మానవ అస్తిత్వ నైజంలోని అన్ని రకాల సందిగ్ధాలూ తీవ్ర పరిమాణం తీసుకుంటాయి. అందుకే నిలిచిపోయే సాహిత్యం పుడుతుంది. దీనికీ, బాహ్య పరిస్థితులు అననుకూలంగా ఉన్నప్పుడు కూడా మంచి సాహిత్యం రాయడం రాయలేకపోవడం అనే సమస్యకూ సంబంధమేమీ లేదు.

**ప్ర** మీ మాటలలోని అర్థాన్ని మరింత విస్తరిస్తే – ఒక స్థిర నిశ్చయం కంటే – భయం, కుతూహలం, ఆందోళన – వంటి అస్థిర ఉద్వేగాల నుంచే గొప్ప సృజన వస్తుంది. ఈ ప్రతిపాదనకు అపవాదులు లేవా? ఆధునికతను మనస్ఫూర్తిగా ఆహ్వానించిన గురజాడ అప్పారావును ఎలా లెక్క వేస్తారు? విశ్వనాథ సత్యనారాయణలో ఆధునికత మీద భయాందోళనలు మాత్రమే ఉన్నాయా, స్థిర నిశ్చయంతో కూడిన వ్యతిరేకత లేదా? పాశ్చాత్య సాహిత్యం నుంచే తప్ప తెలుగు సాహిత్యం నుంచి ఒక్క ఉదాహరణ కూడా ఎందుకు ఇవ్వలేదు?

'ఆధునికతను మనస్ఫూర్తిగా ఆహ్వానించిన గురజాడ అప్పారావు కన్యాశుల్కం హీరోగా ఆధునికతను నిజాయితీగా ఆహ్వానించిన వ్యక్తిని ఎంచుకోలేదు. విరసం వంటి సాహిత్య సిద్ధాంతకారుల మాటలు విని ఉంటే ఆ పని చేసి ఉండేవాడు. అప్పుడు కన్యాశుల్కాన్ని ఈ రోజు ఎవరూ చదివేవారు కాదు. ఆయన ఆధునికతను తన స్వంత ప్రయోజనాల కోసం వాడుకున్న యాంటి హీరోను ఎంచుకున్నాడు. సంప్రదాయానికి కూడా మంచికో చెడుకో దానిని నిజాయితీగా ఆచరించిన బ్రాహ్మణులను కాక గిరీశంను పోలిన దగుల్బాజీలనే ప్రతినిధులుగా ఎంచుకున్నాడు. ఆధునికతకూ సంప్రదాయానికీ మధ్యనున్న వైరుధ్యం రెండు మహత్తరమైన విలువల ప్రపంచాలకు మధ్య ఘర్షణ. ఆ విషయం కన్యాశుల్కం దాచిపెట్టదు.



**కళకూ సాహిత్యానికీ ఒక కర్తవ్యాన్ని నిర్దేశించే ముందు అవి మానవ జీవితంలో ఏ పాత్ర నిర్వహించాయో చూడడం ఉచితంగా ఉంటుంది.**

అందులో మనల్ని ఆధునికత వైపే రమ్మంటుంది. అదే సమయంలో ఆ విలువల అట్టహాసానికి వాటి పేరు మీద కొట్లాడుకునే మనుషుల నేలబారుతనానికీ మధ్యనున్న అంతరాన్ని చూపిస్తుంది. కొంత నవ్వు, కొంత ఆందోళన, నవ్యత పట్ల సానుభూతి, దానికి సాధనాలయిన మనుషులను చూసి కొంత నిస్పృహ కలిగిస్తుంది.

'నాజీ వాదానికి అనుకూలంగా గొప్ప సాహిత్యం రాయడం సాధ్యం కాదనేది నిస్సందేహమే'నని ఫ్రెంచి తత్వవేత్త సార్త్ర్ అంటాడు. బ్రాహ్మణవాదాన్ని గురించి కూడా అదేమాట అనొచ్చు. కానీ ప్రశ్నను ఆ విధంగా వేసుకోవడంలోనే పొరబాటు ఉంది. ఆ విధంగా వేసుకుంటే నిస్సందేహమైన జవాబులే వస్తాయి. 'నాజీ వాదాన్నీ బ్రాహ్మణవాదాన్నీ జయించడం అభ్యుదయవాదులు ఊహించినంత సులభమా అన్న సందేహం గొప్ప సాహిత్యాన్ని సృష్టించగలదా?' అన్న రూపంలో ప్రశ్న వేసుకుంటే అంతటి 'నిస్సందేహమైన' జవాబు రాదు. ఈ వాదాలను జయించడానికి ఎంచుకుంటున్న పద్ధతులు ఒక కొత్త నియంతృత్వానికి, లేక ఒక కొత్త అణచివేతకు దారి తీస్తాయేమోనన్న సందేహం గొప్ప సాహిత్యాన్ని సృష్టించగలదా అన్న రూపంలో వేసుకున్నా కూడా అంతే. విశ్వనాథ సత్యనారాయణలో ఉన్నది ప్రజాస్వామ్యం పట్ల వ్యతిరేకతే తప్ప ఇటువంటి భయ సందేహాలు కావు కాబట్టి ఆయన రాసినదేదీ నిలిచిపోతుందని అనుకోను. అయితే నేను ఆయన రచనలన్నీ చదవలేదు. కాబట్టి కచ్చితంగా చెప్పలేను.

స్థిర నిశ్చయం – భయం అన్న వర్గీకరణ కంటే మనిషిలోని అభ్యుదయ శక్తి పట్ల ఆశాభావం, దానికి ఉండే అవరోధాలపట్ల ఆందోళన అనేది ప్రస్తుత సందర్భంలో ఉపయోగకరమైన వర్గీకరణ అనుకుంటాను. ఆ శక్తి తమలో ఉందని తెలియకుండ మనుషులు నిద్రలో ఉన్నప్పుడు దానిని వారికి చూపించి మేల్కొలపడం మంచి సాహిత్యం సాధారణంగా నిర్వహించే పాత్ర అవుతుంది. అటువంటి సాహిత్యం అన్ని భాషలలోనూ ఉంది. అయితే ఆ శక్తిని తప్ప దానికి ఉండే దానికి ఉండే అవరోధాలను గుర్తించకుండా గుడ్డి ఆశావాదంతో మనుషులు ముందుకు పోతున్నపుడు సాహిత్య స్పృహ దానికి ఉండే పరిమితులనూ అవరోధాలనూ వాటిని గుర్తించకపోతే రాగల విపత్తునూ గుర్తిస్తుంది. వ్యక్తీకరిస్తుంది. నిజానికి మానవ జీవితంలో ఈ రెండు పరిస్థితులూ ఎప్పుడూ కలిసే ఉంటాయి కాబట్టి రెండు కర్తవ్యాలు సాహిత్యం నిర్వర్తిస్తూనే ఉంటుంది. ఎటొచ్చీ ఉద్యమాలకు అనుబంధంగా కాక 'కాంప్లిమెంటరీ'గా ఉంటుంది. అయితే సాహిత్యాన్ని కేవలం ఉద్యమాల నేపథ్యంలో చర్చించడం పొరబాటు. ఉద్యమాలు మానవ జీవితంలో ఎప్పుడూ ఒక చిన్న భాగం మాత్రమే. సాహిత్యం పాత్ర దానికి పరిమితం కాదు. అది జీవితమంత విస్తృతమైనది.

**ప్ర** మానవ స్వభావంలో అభ్యుదయ కాముకులు గుర్తించడానికి భయపడే అగాధాలను అసాధారణ ప్రతిభతో – ప్రగతి వాదుల పట్ల కచ్చతో – దస్తాయవ్‌స్కీ వెలికి తీసి వర్ణించాడని మీరు రాశారు. తెలుగు సాహిత్యంలోని కమ్యూనిస్టు వ్యతిరేకుల రచనలకు అంతటి స్థాయి ఉందంటారా?

దస్తాయవ్‌స్కీ మనిషి మీద ప్రేమతో ఆధునికతను చూసి భయపడ్డాడు. మనిషి మీద ద్వేషంతో కాదు. ఆధునికత – బూర్జువా ఆధునికత అయినా సోషలిస్టు ఆధునికత అయినా – మనిషిలోని మానసిక శక్తిని మాత్రమే చూస్తుంది. దానిని ప్రాతిపదిక చేసుకొని తన వ్యూహాలను రచించుకుంటుంది. అది బలహీనమైన మనిషిని తన రథ చక్రాల కింద తొక్కేస్తుందని భయపడిన రచయితలు 19,20 శతాబ్దాల పాశ్చాత్య సాహిత్య చరిత్రలో చాలా మంది ఉన్నారు. 20వ శతాబ్దపు చరిత్రను సమీక్షించుకుంటే ఇది అవాస్తవికమైన భయం కాదని అర్థం అవుతుంది.

తెలుగు సాహిత్యంలోని కమ్యూనిస్టు వ్యతిరేకులు మనిషి మీద ప్రేమతో – మనిషి బలహీనతపట్ల సానుభూతితో – కమ్యూనిస్టులను చూసి భయపడ్డారా? లేక మనిషి మీద ద్వేషంతో కమ్యూనిజాన్ని ద్వేషించారా? రెండవదే నిజమేమో. అయితే నాకు తెలుగు సాహిత్యంతో ఉన్న పరిచయం తక్కువ కాబట్టి కచ్చితంగా చెప్పలేను.

మల్లేపల్లి లక్ష్మయ్య

(మే 17,1998 ప్రజాతంత్ర వార పత్రిక నుండి)

# హింసపై మీమాంస



ఈ రోజు ఎపిసిఎల్‌సి లో జరుగుతున్న చర్చకు నేపథ్యం ఏమిటి? ఈ అభిప్రాయ భేదాలు కేవలం ఎపిసిఎల్‌సి నాయకుల మెదళ్ళ నుంచి మాత్రమే పుట్టాయా? ప్రజా ఉద్యమాలు, వాటికి ప్రభావం అవుతున్న ప్రజల ప్రమేయం ఏమైనా ఉన్నదా? అంశాలను ఒకసారి గుర్తు చేసుకోవాలి.

రెండున్నర దశాబ్దాలుగా రాష్ట్రంలో పౌర హక్కుల కోసం నిర్విరామంగా పనిచేసిన ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఎపిసిఎల్సి) నేడు తీవ్రమైన ఆచరణ వైరుధ్యాలను ఎదుర్కొంటున్నది. ఇటీవల గుంటూరు పట్టణంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో విభేదాలపై చర్చలు జరిగాయి. ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి కె.బాలగోపాల్, ఇతర రాష్ట్రస్థాయి నాయకులు సంస్థలో రావాల్సిన మార్పుల గురించి చేసిన ప్రతిపాదనలను మెజారిటీ సభ్యులు తోసిపుచ్చారు. ఈ విషయంపై ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలు జరిపి ఓటింగ్ ద్వారా ఒక విధానాన్ని రూపొందించుకున్నారు. సంస్థ ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలు జరిపి ఒక విధానాన్ని ఏర్పరుచుకున్న తర్వాత అదనంగా దాని మీద చర్చ జరిగే అవసరంలేదు. అయితే ఈ చర్చలు నిజంగా ఒక సంస్థలోనే పుట్టి అక్కడకే పరిమితమైనవిగా ఉంటాయా? సమాజం మీద ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తాయనే అంశం మీద కొంతవరకైనా దృష్టి సారిస్తే మంచిది.

ఈ రోజు ఎపిసిఎల్సి లో జరుగుతున్న చర్చకు నేపథ్యం ఏమిటి? ఈ అభిప్రాయ భేదాలు కేవలం ఎపిసిఎల్సి నాయకుల మెదళ్ళ నుంచి మాత్రమే పుట్టాయా? ప్రజా ఉద్యమాలు, వాటికి ప్రభావితం అవుతున్న ప్రజల ప్రమేయం ఏమైనా ఉన్నదా? అంశాలను ఒకసారి గుర్తు చేసుకోవాలి.

**పెద్దపల్లి డిఎస్పి బుచ్చిరెడ్డిని పీపుల్స్ నక్సలైట్లు కాల్చివేశారు. దానిని సాకుగా తీసుకొని అప్పటికే కరీంనగర్ ఎపిసిఎల్సిలో కీలకపాత్ర వహిస్తున్న జాపా లక్ష్మారెడ్డిని పోలీసులు గుర్తు తెలియని వ్యక్తుల రూపంలో కాల్చి చంపారని, పత్రికలు, ఎపిసిఎల్సి తీవ్రంగా ధ్వజమెత్తాయి. అప్పటికీ ఉత్సాహంగా ఉన్న చాలా మంది ఎపిసిఎల్సి కార్యకర్తలకు ఇది పెద్ద షాకుగా మారింది. అంతకన్నా ముందు వరంగల్లో డాక్టర్ రామనాథం హత్య తెలంగాణాలో ఎపిసిఎల్సి ఉద్యమాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. 1985-89 వరకు ఎపిసిఎల్సి మీద తెలంగాణలో తీవ్ర నిర్బంధం అమలు జరిగింది. ప్రజా బంధు పేరుతో బాలగోపాల్ను కిడ్నాప్ కూడా చేశారు.**

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం 1970 దశకం మొదటి భాగంలో ఆవిర్భవించింది. ఆ రోజు శ్రీకాకుళం రైతాంగ పోరాటం ఎదుర్కొంటున్న తీవ్ర నిర్బంధాన్ని, ప్రజలపై అప్పటి ప్రభుత్వం అమలు జరుపుతున్న పాశవిక దమనకాండ నిరోధించడానికి, దానికి వ్యతిరేకంగా ప్రజల, ప్రజాస్వామ్య వాదుల మద్ధతును కూడ గట్టడానికి ఒక ప్రజాస్వామిక హక్కుల సంస్థ కావాల్సి వచ్చింది. ఈ సంస్థను కూడా ఆనాటి విప్లవ పార్టీల చొరవతో కొంతమంది మేధావులు ఏర్పాటు చేశారు. దానికి ప్రప్రథమ అధ్యక్షుడు మహాకవి శ్రీశ్రీ. అయితే దానిలో ప్రధానంగా న్యాయవాదులు ప్రముఖ పాత్ర వహించారు. వారిలో కన్నభిరన్, పత్తిపాటి వెంకటేశ్వర్లు ముఖ్యులు. వారితో పాటు విద్యావేత్తలు, కవులు, డాక్టర్లు, ఇతర ప్రజా ఉద్యమాల కార్యకర్తలు ఈ సంఘంలో చేరారు. ఎపిసిఎల్సి పాత్ర ప్రముఖంగా కనిపించింది ఎమర్జెన్సీ తర్వాతనే. ఎమర్జెన్సీలో ఎన్కౌంటర్ పేరుతో విప్లవకారులను కాల్చి చంపిన ఘటనలపై ఏర్పాటైన భార్గవ కమీషన్ ముందు సాక్షులను హాజరు పరచి నిజానిజాలను బయటకు తీయడంలో పౌర హక్కుల సంఘం కీలక పాత్ర వహించింది. దాని తర్వాత కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ముందుకొచ్చిన రైతాంగ పోరాటం పై భుస్వాములు, గూండాలు, పోలీసులు చేసిన దాడులను వెలికి తీయడంలో కూడా 'సంఘం' చాలా కృషి చేసింది. ఒక వైపు ఇది జరుగుతుండగానే మళ్ళీ ఎన్కౌంటర్ల దురాగతం ప్రారంభమైంది. ఆ రోజు ఎన్కౌంటర్ జరిగిందంటే, మాట్లాడే వారు లేరు. పత్రికలు కూడ చొరవ తీసుకునే స్థితిలో లేవు. అప్పుడు ఎపిసిఎల్సి నిజనిర్ధారణ కమిటీలను ఏర్పరిచి, అసలు వాస్తవాలను బయటకు తీసుకొచ్చాయి. 1985 తరువాత 'ఎన్కౌంటర్' మృతుల బంధువులను మెజిస్టేరియల్ విచారణల వద్దకు తీసుకొచ్చి సాక్ష్యాలు ఇప్పించడం ప్రారంభించారు. ఈ దశలో ఎపిసిఎల్సి పని విధానం పోలీసులకు పెద్ద ఇబ్బందిగా తయారైంది. అప్పుడు కరీంనగర్ జిల్లా యూనిట్ చాలా చురుకైన పాత్ర వహిస్తున్నది. ఈ సమయంలోనే పెద్దపల్లి డిఎస్పి బుచ్చిరెడ్డిని పీపుల్స్ నక్సలైట్లు కాల్చివేశారు. దానిని సాకుగా తీసుకొని అప్పటికే కరీంనగర్ ఎపిసిఎల్సిలో కీలకపాత్ర వహిస్తున్న జాపా లక్ష్మారెడ్డిని పోలీసులు గుర్తు తెలియని వ్యక్తుల రూపంలో కాల్చి చంపారని, పత్రికలు, ఎపిసిఎల్సి తీవ్రంగా ధ్వజమెత్తాయి. అప్పటికీ ఉత్సాహంగా ఉన్న చాలా మంది ఎపిసిఎల్సి కార్యకర్తలకు ఇది పెద్ద షాకుగా మారింది. అంతకన్నా ముందు వరంగల్లో డాక్టర్ రామనాథం హత్య తెలంగాణాలో ఎపిసిఎల్సి ఉద్యమాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. 1985-89 వరకు ఎపిసిఎల్సి మీద తెలంగాణలో తీవ్ర నిర్బంధం అమలు జరిగింది. ప్రజా

బంధు పేరుతో బాలగోపాల్‌ను కిడ్నాప్ కూడా చేశారు. ఆ తరువాత దాడి కూడ జరిగింది. దీనితో విప్లవ రాజకీయాలకు బయట ఉండే ప్రజాస్వామిక వాదులు పౌరహక్కుల సంఘానికి దూరంగా జరిగారు. కొత్త వాళ్ళు చేరడం కూడా ఎక్కువగా జరగలేదు. సరిగ్గా ఇదే సమయంలో ఒక వైపు ఎన్‌కౌంటర్లు, రెండో వైపు ఇన్‌ఫార్మర్ హత్యలు పెరిగాయి. ఇన్‌ఫార్మర్ పేరుతో హత్యకు గురైన వాళ్లలో చాలా మంది బలహీన వర్గాలు, దళితులు కావడం కూడా చర్చనీయాంశమైంది. అప్పటికే కొంత మంది విప్లవ పార్టీల నుంచి బయటకు వచ్చి ఈ విషయంపై చర్చ కూడా లేవదీశారు. అంతే కాకుండా, ఎన్‌కౌంటర్‌లు జరిగిన ప్రదేశాలకు నిజనిర్ధారణలకు వెళ్ళిన ఎపిసిఎల్‌సి నాయకులను ఇన్‌ఫార్మర్ పేరిట హత్యకు గురైన వారి కుటుంబాల సభ్యులు నిలదీయడం మొదలైంది. దానితో పత్రికలు కూడా ఈ విషయమై నక్సలైట్ పార్టీలను విమర్శించడం కూడా మొదలయింది. ఈ ప్రభావం ఎపిసిఎల్‌సి లోని నాయకత్వ పాత్ర నిర్వహిస్తున్న చాలా మంది మీద పడింది. దాని పరిణామమే ఈ రోజు ఎపిసిఎల్‌సిలో జరుగుతున్న చర్చ.

దాని పర్యవసానమే నక్సలైట్ పార్టీలు సామాన్యులను చంపడం మానుకోవాలనే వాదన బలం పుంజుకున్నది. అది సైద్ధాంతిక రూపంలో రాజ్యహింసను ఖండించడంతో పాటు, ప్రైవేట్ హింసను కూడా ఖండించాలనే దాకా వెళ్ళింది.

ఒకవైపు ఈ చర్చ జరుగుతున్న సమయంలోనే రిటైర్డ్ ఐఎఎస్ ఆఫీసర్ ఎస్ఆర్ శంకరన్ నాయకత్వంలో కన్నభిరన్, హరగోపాల్, జయశంకర్, తారకం లాంటి ప్రముఖులు కలిసి పౌరప్రతిస్పందన వేదిక (Concerned Citizens Committee) ను ఏర్పరచినారు. బాలగోపాల్ తదితరులు ఏ అంశాలనైతే లేవనెత్తారో సరిగ్గా అదే అంశాలను మరో రూపంలో ఆ వేదిక ముందుకు తీసుకొచ్చింది.

మొత్తంగా ఈ రోజు ఎపిసిఎల్‌సి లో జరుగుతున్న చర్చ ఆంధ్రప్రదేశం అంతటా జరుగుతున్నది. ఈ విషయమై ఒక సీనియర్ న్యాయవాదిని అడగగా ' ఈ చర్చ రావడమనేది ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా జరిగింది. 1970 నుంచి 1985 వరకు నక్సలైట్లు చేసిన దాడులను ఎవ్వరు అంతగా వ్యతిరేకించలేదు. పైగా ఆమోదం కూడా ఉంది. ఎప్పుడైతే నక్సలైట్లు దాడులకు దళితులు, వెనుకబడిన కులాలు, మహిళలు టార్గెట్స్ అయ్యారో అప్పటి నుంచి ఈ నిరసన ప్రారంభమైంది. అదీ పెరిగి పెరిగి ఎపిసిఎల్‌సిలో చర్చరూపంలో బయటి కొచ్చింది' అని అభిప్రాయపడ్డారు. ఈ రోజు బాలగోపాల్ తదితర నాయకులు చేసిన వాదన వీగిపోవడంతో ఈ చర్చ ఆగిపోదు. మరింత బలం పెరిగి ఇంకొక రూపంలో బయట కొనసాగుతుందనే అభిప్రాయాన్ని బాలగోపాల్‌ను సమర్థిస్తున్న ఒక సీనియర్ నాయకుడు వ్యక్తం చేశారు. నిజానికి పౌరహక్కుల సంఘం ఏ ఒక్క పార్టీకో, ఉద్యమానికో, సంస్థకో, సంఘానికో, 'మౌత్‌పీస్'గా ఉండకుండా,

**ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం 1970 దశకం మొదటి భాగంలో ఆవిర్భవించింది. ఆ రోజు శ్రీకాకుళం రైతాంగ పోరాటం ఎదుర్కొంటున్న తీవ్ర నిర్భంధాన్ని, ప్రజలపై అప్పటి ప్రభుత్వం అమలు జరుపుతున్న పాశవిక దమనకాండ నిరోధించడానికి, దానికి వ్యతిరేకంగా ప్రజల, ప్రజాస్వామ్య వాదుల మద్ధతును కూడ గట్టడానికి ఒక ప్రజాస్వామిక హక్కుల సంస్థ కావాల్సి వచ్చింది. ఈ సంస్థను కూడా ఆనాటి విప్లవ పార్టీల చొరవతో కొంతమంది మేధావులు ఏర్పాటు చేశారు. దానికి ప్రప్రథమ అధ్యక్షుడు మహాకవి శ్రీశ్రీ.**

స్వతంత్రంగా పనిచేయడం ప్రజాస్వామిక పౌరహక్కుల ఉద్యమానికి అవసరమని భావించే వాళ్ళ సంఖ్య ఎపిసిఎల్‌సి లోపల బయట బలంగా కనిపిస్తున్నది. అయితే మెజారిటీ సభ్యులు దానిని వ్యతిరేకించడం చాలా దురదృష్టకరమని, సిఎల్‌సి కార్యకర్త ఒకరు వ్యాఖ్యానించారు.

ఈ పరిణామం ఎపిసిఎల్‌సిని మరింత కుచించుకు పోయే విధంగా తయారు చేస్తుందనే భ్రమని చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. ఎపిసిఎల్‌సి నక్సలైట్ గ్రూప్‌లకు ప్రధానంగా పీపుల్స్ వార్‌కు అనుబంధ సంస్థయని పోలీసులు చేస్తున్న తప్పుడు ప్రచారానికి బలం చేకూర్చే అవకాశమున్నదని ఆంధ్రరాష్ట్రంలో పోలీసులు చేసే అన్ని రకాల అరాచక చర్యలను ఎపిసిఎల్‌సి ఎండగట్టిందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా లాకప్ డెత్‌లు, మహిళలపై అత్యాచారాలు బహిరంగ పరచి జాతీయ స్థాయిలో ఒక గుర్తింపుని తీసుకొచ్చాయి. ఈ విషయం అంతర్జాతీయ స్థాయిలో ఆమ్నెస్టీ దృష్టికి కూడా తీసుకెళ్ళాయి. అదే విధంగా దళితులపై జరిగిన అత్యాచారాలు, కాలుష్యం, రాయలసీమ ముఠా కక్షలు మొదలగు అనేక అంశాల్లో ఎపిసిఎల్‌సి ముందుండి ఉద్యమాలను నడిపింది. రాష్ట్రంలో ఒక ప్రజాస్వామిక వాతావరణాన్ని కాపాడడానికి ఎపిసిఎల్‌సి చేసిన అవిశ్రాంత పోరాటానికి ఎపిసిఎల్‌సి లో జరిగిన ఈ పరిణామం కొంత ఇబ్బంది కలిగించేదిగా ఉంటుందేమోనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఆయనొక 'గతితార్కిక' భూగోళం



ప్రపంచ గమనాన్నే సరిచేసిన గతితార్కిక భౌతికవాదానికి అతడు నిలువుటద్దం. నమ్మిన సిద్ధాంతం పట్ల నిబద్దత, చెప్పే మాటల్లో ఖచ్చితత్వం, సామాన్యుల్లో కలిసేందుకు తాపత్రయం ఇదంతా కలగలిపిన రూపమే ఆకస్మికంగా మృతి చెందిన పౌరహక్కుల నేత బాలగోపాల్. అతనికి వరంగల్ జిల్లాతో ఎనలేని అనుబంధం ఉంది.

**రాజన్న, విద్యారణ్యపురి**

బహుశ రెండు దశాబ్దాల క్రితం విప్లవ ఉద్యమం నగరంలోని ఒక కళాశాలలో పురుడు పోసుకోగా ఆ భావాజాలాన్ని, ఆ ఉద్యమ పంథాను, దానికి నేతృత్వం వహించిన వారిని బహుశ ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి బాలగోపాలే అనే దానికి నిదర్శనాలు అనేకం. రాయలసీమ జిల్లాలో జన్మించిన ఆయన అనూహ్యంగా వరం గల్‌లో విద్యాభ్యాసం ఆపై కాకతీయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగంతో ఇక్కడే కొన్నేళ్ళు ఉండాల్సి రావడంతో ఇక్కడ అప్పటికే వేళ్ళూనుకుంటున్న విప్లవోద్యమంతో అతనికి ఏర్పడిన పరిచయం అతడు ఇతరులతో పెంచుకున్న అనుబంధం ఇప్పుడు వారంతా ఆయనొక గతితార్కిక భూగోళం అంటూ అతనితో గల అనుబంధాన్ని నెమరు వేసుకుంటున్నారు. ప్రధానంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకులుగా ఉన్న కాలంలో తక్కువగా మాట్లాడుతూ ఎక్కువగా ఆలోచిస్తూ ఎప్పుడూ ఆశావాదంతో సమాజ నిర్మాణం గూర్చే మాట్లాడే ఆయన ప్రతిభ, మేధాశక్తిని అనుసరించడంలో ఆయనకు ఆయనే సాటియని వారంటున్నారు. మ్యాథమెటిక్స్ విభాగం నుండి వచ్చిన వారు కావడంతో ఎప్పుడూ అతని ఆలోచన ప్రపంచ భౌగోళిక, రాజకీయ పరిణామాలపై అన్వేష పూరితంగా ఉండడమే కాక విశ్వవిద్యాలయ స్థాయిలో విశాల దృక్పథంతో జరిగే ప్రతి చర్చలో అతడు ఖచ్చితత్వం కొరకు పట్టుబట్టేవాడని పలువురు సామాజిక శాస్త్రాల సహచర అధ్యాపకులు గుర్తు చేసుకుంటున్నారు. విప్లవ భావాజాలాన్ని ఆకలింపుచే సుకోవడం వరకే ఎదిగిన ఆయన ప్రజాబాహుల్యంతో సంబంధాలను పెంచుకునే దిశలో దాదాపు 1991లో హన్మకొండ ప్రకాశ్‌రెడ్డి నగర్ ప్రాంతంలో జరిగిన రైతు కూలీ సంఘం మహాసభలో మొదటిసారిగా విప్లవోపన్యాసం చేసినట్లు పలువురు గుర్తు చేసుకుంటున్నారు. అశేష జనవాహినిలో విప్లవ పాఠాలు ప్రారంభించిన పద్దతి ఆ రోజుల్లోనే బాలగోపాల్ ఒక 'విప్లవ పాఠ్యాంశం' అనే ప్రచారం జరిగినట్లు వారంటున్నారు. పౌరహక్కుల ఉద్యమంలో వివిధ దశలను దాటుతూ మానవ హక్కుల వేదికకు మరలిన తరువాత కూడా ఆయన తరచూ జిల్లా కేంద్రానికి వస్తూ అనేక ప్రజాసంఘాల వేదికలపై ప్రసంగించడం ఆనవాయితీగా కొనసాగుతూ ఆ మాటలన్ని సిద్దాంత దొంతరలుగా ఉండేవేనని పలువురు సీనియర్ పాత్రికేయులు కూడా నేటికి విశ్లేషించుకుంటున్నారు. పౌరహక్కుల వేదిక నుండి సిద్దాంత వైరుధ్యంతో హక్కుల వేదికకు మారిన బాలగోపాల్ ఆ తరువాత విశ్వవిద్యాలయంతో అనుబంధం ఉన్నప్పటికి పెద్దగా విశ్వవిద్యాలయంలో జరిగే సదస్సుల్లో అతడు పాల్గొనలేకపోయేవాడు. అయితే విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గత సంవత్సరం ఏప్రిల్ నెలలో పిజి కళాశాలలో బిబి కోశాంబితత్వంపై చేసిన ప్రసంగం ఆ తరువాత 2008 మార్చిలో అదే విభాగం నిర్వహించిన జాతీయ సదస్సులో పాల్గొని చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అతడు చేసిన సిద్దాంత ప్రసంగం మినహాయిస్తే క్రమంగా ప్రొఫెసర్ బాలగోపాల్ విశ్వవిద్యాలయం నుండి తన పరిధిని తగ్గించుకొని పూర్తిగా ప్రజాసంఘాలు జిల్లా కేంద్రంలో నిర్వహించే సదస్సుల్లోనే అధికంగా పాలుపంచుకునే వారు.

కవర్ కథనం



యం. కోదండరామ్

**అమరుడు డా॥ బాలగోపాల్‌ను గుర్తు చేసుకోవడమంటే 30 సంవత్సరాల ఆంధ్రప్రదేశ్ చరిత్రను మననం చేసుకోవడమే. ప్రజాఉద్యమాలు ఆయనను మానవతావాదిగా మారిస్తే ఆయన తన జీవితాన్ని ప్రజల హక్కుల సాధనకొరకే అంకితం చేసిండు. ఇతరుల హక్కుల కొరకు మాత్రమే డా॥ బాలగోపాల్ కొట్లాడలేదు తన జీవితంలోను ప్రజాస్వామిక విలువలను ఆచరించినాడు. అందుకే ఆయన నడిచిన జాగలల్ల ఇవ్వాళ చీకటే ఆవరించింది. 1980లో బాలగోపాల్ పౌరహక్కుల ఉద్యమం వైపు ఆకర్షితుడు కావడానికి వరంగల్ వాతావరణమే దోహదపడింది. తిరుపతిలో డిగ్రీ పూర్తి చేసుకొని ఎం.ఎస్.సి చదవడానికి బాలగోపాల్ వరంగల్, రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీలో చేరిండు ఆ తరువాత అక్కడనే పి.హెచ్.డి కూడా పూర్తి చేసినాడు. వరంగల్ వచ్చేవరకు ఆయన లెక్కల మేథావి బాలగోపాల్. వరంగల్ రాజకీయ పరిస్థితులు ఆయనను హక్కుల బాలగోపాల్‌గా మార్చివేసినాయి.**

బాలగోపాల్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీలో (ఆర్.ఇ.సి) చదువుతున్న కాలానికి రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ ఏర్పడింది. ఆర్.ఇ.సిల సూరపనేని జనార్ధన్ నాయకత్వంలో ఆ సంస్థ కార్యకలాపాలు నడుస్తున్నాయి. కేవలం విద్యార్థులనే కాక మెస్ వర్కర్లను, ఆర్.ఇ.సి చట్టుపక్కల గ్రామాల ప్రజలను సూరపనేని సంఘటిత పర్చారు. ఎమర్జన్సీ విధించిన తరువాత సూరపనేనిని పోలీసులు అరెస్టుచేసి గిరాయిపల్లి ఎన్‌కౌంటర్లో కాల్చి చంపినారు.

రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ కార్యకలాపాలను డా॥ బాలగోపాల్ నిశితంగా పరిశీలించేవాడు. నమ్మిన రాజకీయాల కొరకు విద్యార్థులు ప్రాణాలను బలిదానం చేయడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అందుకే ఆ రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. క్రమంగా ఆయనలో తాత్విక అన్వేషణ మొదలైంది. ఈ క్రమంలోనే డా॥ బాలగోపాల్ సామాజిక పరిస్థితులు అర్థమయ్యాయి. వాటిని విశ్లేషించే మార్గమూ తెలిసింది.

ఈ పరిస్థితి కొనసాగుతుండగానే ఎమర్జన్సీ ఎత్తివేసినారు. ఎమర్జన్సీ ఎత్తివేయగానే దేశవ్యాప్తంగా ఎమర్జన్సీ కాలంలో జరిగిన దురాగతాలకు వ్యతిరేకంగా లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ నేతృత్వంలో బలమైన ప్రజాస్వామిక ఉద్యమం ఉప్పెన వలె లేచింది. భారతదేశంలో ప్రజాస్వామ్యం పదిలంగా ఉందని నమ్మినవారికి ఎమర్జన్సీ కనువిప్పు కలిగించింది. పాలకులకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితం కాకుండా భారతదేశం ప్రజాస్వామ్యంగా నిలబడలేదన్న అభిప్రాయం బలపడింది. ఈ స్ఫూర్తితో ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి దేశవ్యాప్తంగా హక్కుల ఉద్యమాలు అంకురించాయి. ఈ ఉద్యమాల ద్వారా ప్రజాస్వామిక విలువల కొరకు పనిచేయాలన్న లక్ష్యంతో బాలగోపాల్ 1981లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో చేరినాడు. 1983లో సంస్థ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు.

బాలగోపాల్ చేరిన నాటికి పౌరహక్కుల సంఘానికి విస్తృతమైన నిర్మాణం, నిరంతరమైన పని విధానం ఉండేవి కావు. హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు ప్రజాసంఘాల సాయంతో హక్కుల కార్యకర్తలు నిజనిర్ధారణకు పోయి, వాళ్ళ సాయంతోనే మీటింగులు పెట్టి ఖండించేవారు. ఇతర సంఘాల మీద ఆధారపడి పనిచేయవలసి వచ్చేది. బాలగోపాల్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తరువాత ఈ సంప్రదాయం పోయింది. స్టేజిలు ఏర్పాటు చేసుకోవడం నుంచి మొదలుకొని పోస్టర్లు అందించడందాకా అన్ని పనులు పౌరహక్కుల సంఘం స్వతంత్రంగా చేసుకోవడం ఆరంభించింది. సాయంకాలాలు కరపత్రాలు పంచి రాత్రిపూట సైకిళ్ళపై గోధుమపిండి లై డబ్బాలను, పోస్టర్లను పెట్టుకొని బయలుదేరి రోడ్ల వెంట అంటించేది.

అప్పట్లో హక్కుల సంఘాలలో పనిచేయాలంటే నిత్యం పోలీసులతో ఘర్షణ పడవలసి వచ్చేది. తామూ చట్టం ప్రకారం నడుచుకోవాలన్న స్పృహ పోలీసులలో పీసమెత్తు కూడా ఉండేది



> **“ మతతత్వాన్ని రూపుమాపడానికి బాలగోపాల్ పౌరహక్కుల సంఘంలో చేరిననాటి నుండి కార్యక్రమాలు తీసుకున్నారు. మతతత్వంపై విమర్షనాత్మక వ్యాసాలు రాసిండు. మైనరిటీలపై దాడులు జరిపిన ఘటనలను అధ్యయనం చేసిండు. ఆ ఘటనలపై నిరసన సభల సభ్యులను కోరేవాడు. రాష్ట్ర వ్యాప్తంగా మతతత్వానికి వ్యతిరేకంగా ఎన్నో ప్రచారం కార్యక్రమాలను చేపట్టింది. సరళీకరణకు మతతత్వానికి మధ్యనున్న సంబందాన్ని వివరిస్తూ బాలగోపాల్ చేసిన రచనలు, ప్రసంగాలు వర్తమాన రాజకీయ పరిస్థితిని అర్థం చేసుకోవడానికి తోడ్పడతాయి. ”**

కాదు. తాము చెప్పిందే చట్టం, తమ ఆజ్ఞలను అనుసరించడమే ప్రజల కర్తవ్యం అన్న ధోరణతో పోలీసులు వ్యవహరిస్తుండే వారు. కనుక అక్రమ అరెస్టులను, ఎన్‌కౌంటర్ హత్యలను ఖండించడమంటే పోలీసుల విచ్చలవిడి అధికారాలను ప్రశ్నించడమే. ఆర్.ఇ.సిలో కలిగిన చైతన్యం, పెంపొందిన తాత్విక దృక్పథం ఇచ్చిన నిబద్ధత, తనకున్న మొండితనం వలన బాలగోపాల్ పౌరహక్కుల సంఘాన్ని నడిపించగలిగాడు. ఇటు ప్రజా ఉద్యమాలు, అటు పోలీసుల దాడుల వలన అగ్గిగుండంగా మారిన వరంగల్లులో పౌరహక్కుల కార్యకలాపాలను కొనసాగించినాడు. నిజనిర్ధారణ కమిటీలు వేసి హక్కుల అణచివేతకు సంబందించిన ఘటనలకు సంబందించి వాస్తవాలను వెలుగులోకి తేవడం ఆ రోజుల్లో ప్రధాన కార్యక్రమంగా ఉండేది. ప్రజలతో మాట్లాడి చాలా జాగ్రత్తగా విషయాలను సేకరించి ఆ సమాచారం ఆధారంగా నివేదికలు తయారు చేసే వాళ్ళం. ఈ నిజనిర్ధారణ కమిటీల వల్లనే బాలగోపల్‌కు ఆంధ్రప్రదేశ్ సామాజిక, ఆర్థి పరిస్థితులపై అవగాహన ఏర్పడింది. అందుకే ఆయన వివిధ ఘటనలపై ఇంగ్లీషులో రాసిన వ్యాసాలకు మంచి గుర్తింపు వచ్చింది. పోలీసుల దాడులను తట్టుకొని సంస్థను నిలబెట్టడమే కాక క్రమంగా పౌరహక్కుల సంస్థ కార్యరంగాన్ని కూడా విస్తృత పరిచినాడు.

బాలగోపాల్ ప్రధాన కార్యదర్శి అయ్యేనాటికి అన్ని రకాల అణచివేతలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్న సోయి పౌరహక్కుల సంఘానికి ఉన్నది. కానీ వివిధ కారణాల వలన అది ఆచరణలోనికి రాలేదు. తొలుత కేవలం నిర్బంధ వాతావరణాన్ని తట్టుకొని నిలబడాలన్న తాపత్రయంతో బాలగోపాల్ నేతృత్వంలో పౌరహక్కుల సంఘం కార్యకలాపాలను విస్తృత పరుచుకున్నది. మార్క్సిస్టు - లెనినిస్టు పార్టీల కార్యకర్తలపై దాడులు జరిగినప్పుడే కాక సాధారణ ప్రజల హక్కులకు విఘాతం కలిగినప్పుడు కూడా పౌరహక్కుల సంఘం కార్యక్రమాలను తీసుకొన్నది, లాకప్పు హత్యలు, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలపైనే కాకా అనేకానేక ఇతర సమస్యలను పౌరహక్కుల కోణం నుండి చూసి స్పందించడం వలన హక్కుల ఉద్యమ పరిధి విస్తరించింది. ఎన్నో అంశాలపైన పౌరహక్కుల సంఘం కార్యక్రమాలను తీసుకున్నది నిజనిర్దారన కమిటీ నివేదికలను ప్రచురించింది. ఆ క్రమంలో కాలుష్యంపైన నివేదికలను తీసుకొచ్చింది. కరువు పరిస్థితిపై హక్కుల దృక్పథం నుండి అద్యయనం చేసి పరిష్కార మార్గాలను పౌరహక్కుల సంఘం ప్రతిపాదించింది. ప్రజలు ప్రభుత్వం నుండి సంక్షేమాన్ని ఒక హక్కుగా డిమాండ్ చేసే అవకాశాన్ని కల్పించాలని పౌరహక్కుల సంఘం డిమాండ్ చేసింది. రాయలసీమ ముఠా కక్ష్యలపై తెచ్చిన పుస్తకాలు ఆ ప్రాంతాన్ని ప్రజాస్వామిక విలువల ప్రాతిపదికన పునర్నిర్మాణం చేయడానికి పౌరసమాజం, రాజకీయ వ్యవస్థ చేయవలసిన పనులను వివరించింది. స్త్రీలపై ఇంట్లో, బయటా జరుగుతున్న దాడులపై కోర్టుల నుండి

సేకరించిన సమాచారం ఆధారంగా పుస్తకాన్ని సంస్థ వెలువరించింది. అట్లాగే ప్రభుత్వ నిర్బంధ విధానాలపై ఎన్నో పుస్తకాలు అచ్చుయినాయి. ఈ పుస్తకాల రూపకల్పనలో బాలగోపాల్ శ్రద్ధ చూపేవాడు. చాలా పుస్తకాలను ఆయనే రాసినాడు. ఇతరులు రాసినా జాగ్రత్తగా ఎడిటింగ్ చేసేవాడు. ఎక్కడా వాస్తవాలకు విరుద్ధంగా రాసినా, సరైన సాక్ష్యాలు చూపకుండా రాసినా అంగీకరించే వాడు కాదు. అందుకే పౌరహక్కుల సంఘాల నివేదికలకు ఎంతో గౌరవం ఉన్నది. మానవ హక్కుల వేదిక ఈ సంప్రదాయాన్ని కొనసాగించింది.

కేవలం నిజనిర్ధారణ కమిటీలకే సంస్థ పరిమితం కాలేదు. బాలగోపాల్ బాధితులకు న్యాయం అందించడానికి వివిధ రూపాల్లో ప్రయత్నం చేయాలనే వాడు. ఎన్‌కౌంటర్లపై మానవహక్కుల కమిషన్ ముందు పిటిషన్ వేసినాడు. కొన్ని ఎన్‌కౌంటర్ ఘటనలనైనా పరిశీలించాలని ఆయన చేసిన విజ్ఞప్తిని కమిషన్ మన్నించింది. న్యాయ విచారణ కమిషన్ ముందు బాధితులను ప్రవేశపెట్టి విచారణ సరిగ్గా జరగటానికి, బాధితులకు న్యాయం చేకూర్చడానికి తోడ్పడే వాడు. అందుకు గాను ముందే బధితులను కలిసి వారి వాంగ్మూలాలను రాసి టైప్ చేసి సంతకాలు తీసుకొని కమిషన్ ముందుంచే వారు. పోలీసులను చూసి భయపడవద్దని బాధితులకు ధైర్యం చెప్పి వారి చేత కమిషన్ ముందు సాక్ష్యం ఇప్పించే వారు. మిస్సింగ్ కేసులపై టి.ఎల్.ఎన్ రెడ్డి కమిషన్ ముందు బాధితులను హాజరు పరచడానికి బాలగోపాల్ చేసిన కృషి మరువరానిది. చింతపల్లి ఆదివాసుల గుడిసెలను పోలీసులు, అటవీశాఖ అధికారులు తగులపెడితే ఆవిషయంపై ఆదివాసులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం స్పందించలేదు. రిటైర్డ్ జడ్జిలతో పౌరుల తరుపున ప్రజా ట్రిబ్యునల్ వేసి ఘటనకు సంబందించిన విషయాలు వెలుగులోకి రావడానికి కృషి చేసిండు.

బాధితులకు న్యాయం అందించడానికి కోర్టుల్లో కేసులను వాదించిన విషయం అందరికీ తెలిసిందే. కానీ లాయరు కాకమునుపే ఆయన ఎన్నో కేసులలో పిటిషన్ తయారు చేసిండు. కేసులో వాదించడానికి కావలసిన సమాచారాన్ని ఇస్తే కన్నభిరాన్ వంటి సీనియర్ అడ్వకేట్లు కేసు వాదించేవారు. నష్టపరిహారం ఇప్పించడానికి, ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగేవాడు. ముఖ్యంగా ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు నష్టపరిహారాన్ని ఇప్పించడానికి ఎంతో కృషి చేసిండు.

మతతత్వాన్ని రూపుమాపడానికి బాలగోపాల్ పౌరహక్కుల సంఘంలో చేరిననాటి నుండి కార్యక్రమాలు తీసుకున్నారు. మతతత్వంపై విమర్శనాత్మక వ్యాసాలు రాసిండు. మైనారిటీలపై దాడులు జరిపిన ఘటనలను అధ్యయనం చేసిండు. ఆ ఘటనలపై నిరసన సభల సభ్యులను కోరేవాడు. రాష్ట్ర వ్యాప్తంగా మతతత్వానికి వ్యతిరేకంగా ఎన్నో ప్రచారం కార్యక్రమాలను చేపట్టింది. సరళీకరణకు మతతత్వానికి మధ్యనున్న సంబందాన్ని వివరిస్తూ బాలగోపాల్ చేసిన రచనలు, ప్రసంగాలు వర్తమాన రాజకీయ పరిస్థితిని అర్ధం చేసుకోవడానికి తోడ్పడతాయి.

**“ పాలకులకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితం కాకుండా భారతదేశం ప్రజాస్వామ్యంగా నిలబడలేదన్న అభిప్రాయం బలపడింది. ఈ స్ఫూర్తితో ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి దేశవ్యాప్తంగా హక్కుల ఉద్యమాలు అంకురించాయి. ఈ ఉద్యమాల ద్వారా ప్రజాస్వామిక విలువల కొరకు పనిచేయాలన్న లక్ష్యంతో బాలగోపాల్ 1981లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో చేరినాడు. 1983లో సంస్థ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. ”**





> బాలగోపాల్ ప్రధాన కార్యదర్శి అయ్యేనాటికి అన్ని రకాల అణచివేతలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్న సోయి పౌరహక్కుల సంఘానికి ఉన్నది. కానీ వివిధ కారణాల వలన అది ఆచరణలోనికి రాలేదు. తొలుత కేవలం నిర్బంధ వాతావరణాన్ని తట్టుకొని నిలబడాలన్న తాపత్రయంతో బాలగోపాల్ నేతృత్వంలో పౌరహక్కుల సంఘం కార్యకలాపాలను విస్తృత పరుచుకున్నది.

భారతదేశంలో చాలా సంఘాలు తమ కార్యకలాపాలను పెంచుకున్నాయి. అయితే బాలగోపాల్ మాత్రమే ఈ పరిణామాలను సిద్ధాంతీకరించి పౌరహక్కుల ఉద్యమానికి కార్యరంగము, పని విధానము నిర్దిష్టంగా ఉంటాయని తేల్చిచెప్పినాడు. ఈ విషయంలో బాలగోపాల్ చేసిన కృషి చాలా కీలకమైనది. తనకంటూ ఒక ప్రత్యేక కార్యక్షేత్రాన్ని, పని పద్ధతులను రూపొందించుకోవడం వల్లనే ఆంధ్రప్రదేశ్‌లో హక్కుల ఉద్యమం సజీవంగా నిలబడ్డది.

భారతదేశంలో 1980ల దాకా హక్కుల సంఘాలు లోహియా ఏర్పరిచిన చట్రంలో పనిచేస్తూ వచ్చినాయి. 1936లో తొలుతగా లోహియా పౌరహక్కుల భావనను నిర్వహించి, పౌరహక్కుల సాధనకై హక్కుల సంఘాలు నిర్వర్తించవలసిన కర్తవ్యాలకు దిశానిర్దేశన చేసినాడు. ఆ తరువాత సామాజిక చలనాలకు అనుగుణంగా పౌరహక్కుల భావనను విస్తరించడానికి కావలసిన తాత్విక పునాదిని హక్కుల ఉద్యమాలు తయారు చేయలేకపోయినాయి. సామాజిక మార్పులకు అనుగుణంగా సిద్ధాంత భూమికను ఏర్పాటు చేసుకోక పోవడం వల్లనే చాలా రాష్ట్రాలలో హక్కుల ఉద్యమాలు కాల పరీక్షకు నిలబడలేక పోయాయి. ఆ లోపం ఆంధ్రప్రదేశ్ ఉద్యమంలో లేదు. హక్కుల కార్యాచరణను నిశితంగా పరిశీలించి సిద్ధాంత పరికల్పన చేయడం ద్వారా బాలగోపాల్ హక్కుల ఉద్యమాన్ని బలోపేతం చేసి బాధితులకు న్యాయాన్ని అందించడంలో దోహదపడ్డారు.

హక్కులు సమాజికమైనవి అన్నది లోహియా. ఈ సూత్రీకరణకు ఉన్న వివిధ పార్శ్వాలను బాలగోపాల్ వెలుగులోకి తెచ్చినాడు. నిండైన జీవితాన్ని పొందడానికి అణచివేయబడే సమూహాలు భిన్న రాజకీయ విశ్వాసాలతో అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమిస్తారు. ప్రజాస్వామిక విలువలు ఊటలు ఊరేది ఈ ఉద్యమాల చెలిమిలోనే. ఉద్యమాల నుండి ఉద్భవించిన ప్రజాస్వామిక విలువలను, హక్కులను స్వీకరించి, వాటి రక్షణకు నిరంతరం పోరాటం చేసి వ్యవస్థీకరించాలని బాలగోపాల్ అన్నారు.

విభిన్న ఉద్యమాల సారాంశమే హక్కుల ఉద్యమం. ఈ ప్రస్థానంలో హక్కుల భావనకానీ, ఉద్యమంకానీ రాజకీయ చట్రాల పరిధిలో ఇరుక్కొని తన ప్రత్యేక అస్థిత్వాన్ని కోల్పోవని బాలగోపాల్ వాదించాడు. ఈ తండ్లాటలో బాలగోపాల్ అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. అయినా చెలించని విశ్వాసంతో ముందుకు సాగినాడు. తాను ఎంచుకొన్న ఈ ఉదాత్తమైన పాత్ర వల్లనే అన్ని రకాల ప్రజా ఉద్యమాలతో మమేకం కాగలిగినాడు. బాలగోపాల్ ఈ క్రమంలో బాధితులకు గోపాల్ అయినాడు.

ప్రజాస్వామిక వాదులు ప్రజాస్వామిక విలువలను ప్రవచించడమే కాదు ఆచరించాలన్నాడు. ఆధిపత్యం, అణచివేత ఏ రూపంలో వ్యక్తమైన నిబద్ధతో, నిజాయితీతో వ్యతిరేకించాలన్నాడు. ఆఖరుకు ప్రజాద్యమాలు కూడా తన కార్యాచరణలో ఆ విలువలను ప్రతిబింబించనప్పుడు ఆ విలువల ఆధారంగానే ప్రశ్నించాలన్నాడు. సమాజాన్ని మానవీయంగా చేసే అపురూపమైన ప్రయత్నం వల్లనే బాలగోపాల్ మానవతారగా తళుక్కుమన్నారు. ఆయనను స్మరించడమంటే మనలోని మానవతను మననం చేసుకోవడమే

# హక్కును నిర్వచించిన సిద్ధాంతకర్త

శ్రీవత్స

మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ కె. బాలగోపాల్ గురువారం ఆకస్మిక మృతికి గురికావడం పట్ల దేశంలోని ప్రజాతంత్ర వాదులు, హక్కుల కార్యకర్తలు, అభిమానులు, ఆదివాసీ, దళిత, గిరిజన ప్రజలు తమ ఆత్మీయున్ని కోల్పోయిన భావనలో గొల్లుమన్నారు. బాలగోపాల్ అనంతపురం జిల్లాలోని కంబదూరు రాళ్ళ అనంతపురం ప్రాంతానికి చెందినవారు. విద్యాభ్యాసం తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి వరంగల్‌లోని రీజనల్ ఇంజనీరింగ్ కళాశాలలో గణితశాస్త్రంలో పిహెచ్‌డి పూర్తి చేసారు. అనంతరం 1980లో కాకతీయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకునిగా ఉద్యోగంలో చేరి అనతికాలంలోనే సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాల పట్ల పెల్లుబుకిన నిరసన, విప్లవ ఉద్యమాలతో పరోక్ష సంబంధాలు నెరపి 1985లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి హక్కుల ఉద్యమానికి పూర్తిగా అంకితమైనాడు. ఇదే తరహాలో బాలగోపాల్‌పై కూడా దాడులు, దౌర్జన్యాలు, కిడ్నాప్‌లకు పాల్పడ్డ సందర్భాలు ఉన్నాయి. సమాజంలోని అసమానతలను పారదోలడానికి హక్కుల ఉద్యమం ఇంకా అనేక కోణాల్లో విస్తృత రూపాన్ని తీసుకోవల్సిన అవసరం ఉందని, ప్రజలు ఎదుర్కొంటున్నది కేవలం రాజ్యహింస మాత్రమే కాదని, ప్రైవేటు హింస కూడా ఎదుర్కొంటున్నారని కాబట్టి వీటన్నింటిపై హక్కుల సంఘం పోరాడాల్సిన అవసరం ఉందని పౌరహక్కుల సంఘంలో క్రియాశీలకంగా పని చేస్తూనే 1996 వరకు పలుదఫాలుగా చర్చపెట్టిన అనంతరం ఏకాభిప్రాయం కుదరని కారణంగా పౌరహక్కుల సంఘంనుండి తనతో పాటు డాక్టర్ బుర్రా రాములు, ఎస్.జీవన్‌కుమార్, తదితర 30 మంది కార్యకర్తలతో బయటకు వచ్చి 1997 సంవత్సరంలో మానవహక్కుల వేదిక అనే హక్కుల సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఉత్తర తెలంగాణలో కనీసం సమస్యలపై సదస్సులు, అమరులైన సామాజిక ఉద్యమకారుల సంస్మరణ సభలు, సంతాప సభలు పెట్టుకోవడానికి కూడా రాజ్యం నిరాకరిస్తున్న పరిస్థితులల్లో కూడా ఏ మాత్రం వెనకడుగు వేయకుండా సంఘ కార్యక్రమాలను ముందుకు నడిపించాడు.

## నిరంతర అన్వేషణ ఆయన నైజం

బాలగోపాల్‌కు దేశంలోని కాశ్మీర్‌నుండి కన్యాకుమారి వరకు గల భౌగోళిక, నైసర్గిక విషయాలపై ఆయా ప్రాంతాల ప్రజల సామాజిక, రాజకీయ, సాంఘిక, ఆర్థిక స్థితిగతులపై, సమస్యలపై సంపూర్ణ అవగాహన కల్గిన మేధావి. ఇంతటి మేధోసంపత్తి కలిగిన వారు మనదేశంలో అరుదనే చెప్పవచ్చు. మూడు దశాబ్దాలపాటు కొనసాగిన హక్కుల ఉద్యమంలో పీడిత ప్రజల హక్కుల దరువై



మ్రోగాడనడంలో అతిశయోక్తిలేదు. మనదేశంలో నెలకొనిఉన్న ఆధిపత్య వర్గాల అణచివేతకు, అధికారం కొరకు కొందరు, అధికారం నిలుపుకోవడానికి మరికొందరు రాజకీయంగా ఎంతకైనా దిగజారుతున్న సందర్భాల్లో ఉల్లంఘించబడుతున్న ప్రజల హక్కుల పరిరక్షణకు నడుంబిగించిన బాలగోపాల్ కృషి అసాధారణమైనది. రెండు దశాబ్దాలకుపైగా కొనసాగుతున్న రాజ్యహింస, ఎన్‌కౌంటర్లపై స్పందించడమేకాక వాటిలో పాల్గొన్న పోలీసులపై హత్యానేరం క్రింద కేసునమోదు చేయాలని సుదీర్ఘకాలం పాటు పోరాటంచేసి సాధించిన ఘనత చరిత్రలో నిలిచిపోతుంది. వెనుకబడ్డ ప్రాంతాల ప్రజల సంస్కృతిని సాంప్రదాయల పట్ల హేళన, వనరుల దోపిడికి వ్యతిరేకంగా పోరాటం చేయడం ఆ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్ష అనే కోణంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికై, దేశంలో రైతులను కూలీలుగా మార్చి, కూలీలను బిక్షగాల్లుగా మార్చే స్పెషల్ ఎకనామిక్ జోన్ వంటి వాటి పట్ల, ఆదివాసీల హక్కులను, ప్రాణాలను హరించివేసే బాక్సైట్ గనుల తవ్వకాల విషయంలో, భూగర్భజలాలు అడుగంటిపోయి కనీసం త్రాగునీరు, సాగునీరు లేక గ్రామాలకు గ్రామాలను విధ్వంసానికి గురిచేసే ఒపెన్‌కాస్ట్ గనుల తవ్వకాలపైనే కాక జాతీయ స్థాయిలో గుజరాత్‌లో మతఘర్షణలు, ఉగ్రవాదం పేరిట జమ్మూ కాశ్మీర్‌లో జరుగుతున్న ప్రజల హక్కుల ఉల్లంఘన, వివక్షతో కూడిన జలవిధానాల వల్ల ఏర్పడిన ప్రాంతీయ జలవివాదాలపైనే కాక అంతర్జాతీయంగా సామ్రాజ్య విస్తరణలో భాగంగా పోలీస్‌పాత్ర పోషిస్తున్న అమెరికా విదేశాంగ విధానాలపై, దాని దాడులవల్ల నష్టపోయిన దేశాలకు సంఘీభావం తెలుపడంలో దేశంలోని ప్రజాతంత్ర వాదులను కలుపుకొని ఉద్యమించిన గొప్పమానవతావాది బాలగోపాల్.

ఎన్. వేణుగోపాల్



# అక్షరాలా తీరని లోటు

"'ఆయన లేని లోటు పూడ్చలేనిది' అనే మాట వినీ వినీ అరిగిపోయింది గాని ఆ మాట అక్షరాలా వర్తించే, సంపూర్ణంగా నిజమయ్యే మనిషి కె.బాలగోపాల్ (1952-2009). నిజంగా తెలుగు సమాజానికి, ప్రజా ఉద్యమాలకూ, ప్రజల హక్కుల పరిరక్షణకూ, తెలుగునాట మేధో కృషికీ ఆయన మరణం తీరని లోటు. ప్రజల సమస్యలను ఆయన పట్టించుకున్నంత తీవ్రంగా పట్టించుకునే, ఆయన ఆలోచించినంత సమగ్రంగా ఆలోచించే, ఆయన పనిచేసినంత సమర్థంగా పనిచేసే మనుషులు తయారు కావడానికి ఎంతకాలం పడుతుందో చెప్పలేము. తెలుగు సమాజం మాత్రమే కాదు యావత్ దేశమే ఒక ఆత్మీయ మిత్రుడిని, హక్కుల కోసం ఎలుగెత్తే గొంతును కోల్పోయింది. అటు చివర కాశ్మీర్ నుంచి మరొక చివర ఈశాన్య ప్రాంత ఉద్యమ కారులు, ప్రత్యేక ఆర్థిక మండలాల నిర్వాసితులు, దేశవ్యాప్తంగా అభివృద్ధి పథకాల నిర్వాసితులు, ప్రపంచీకరణ విధానాల బాధితులు, రాష్ట్రంలోని అన్ని ప్రజా ఉద్యమాల కార్యకర్తలు, విప్లవోద్యమ కార్యకర్తలు, దళితులు, ఆదివాసులు, మహిళలు, మైనారిటీలు ఆయన స్పృశించని బాధిత సమూహం లేదు.
ఆయన పట్టించుకోని జీవన సమస్య లేదు."

ఇరవై ఐదు సంవత్సరాల కింద వరంగల్‌లో పనిచేస్తుండిన ఒక పోలీసు అధికారి ఇలస్ట్రేటెడ్ వీక్లీలో ఉత్తరం రాస్తూ బాలగోపాల్ గురించి 'ఎక్కడ శవం కనబడితే అక్కడ వాలే రాబందు' అని వ్యాఖ్యానించాడు. (ఇప్పుడు అదే పోలీసు అధికారి ఆయనను ప్రశంసిస్తూ మాట్లాడుతున్నాడు). ఆ మాటలో ఉన్న కసినీ, వ్యంగ్యాన్నీ, దూషణనూ పట్టించుకోనక్కరలేదు. కాని నిజంగానే బాలగోపాల్ 'బ్రదుకును ప్రచండ భేరుండ గరుత్పరిరంభంలో పట్టిన గానం' లాంటి సమగ్ర వ్యక్తి. బతుకులోని సమస్త విషయాలనూ ఆయన పట్టించుకున్నారు. నిజంగానే గండభేరుండ దృష్టితో విహంగ వీక్షణ చేసి తన పరిధిలోకి రాని విషయం లేదని రుజువు చేసుకున్నారు. ప్రజాసమస్యల పరిశీలనకూ, ప్రజల హక్కుల రక్షణకూ ఎంత తీక్షణ, అత్యంత నిశిత దృష్టి అవసరమో ప్రదర్శించి చూపారు.

యాభై ఏడు సంవత్సరాల జీవితంలో, తొలి ఇరవై ఐదు సంవత్సరాలు చదువుకు పోయినా, మిగిలిన ముప్పై సంవత్సరాలకు పైగా ఆయన సాధించిన విస్తృతి, సాగించిన కృషి చూస్తే ఒక మనిషి, ఇంత జీవితకాలంలో ఇన్ని సాధించగలరా అని ఆశ్చర్యం వేస్తుంది. నిజానికి ఆ చదువు కూడా ఆయన ఎంత అసాధారణ ప్రతిభతో సాగించారంటే, 1981లో ఆయన కాకతీయ విశ్వవిద్యాలయం గణిత శాస్త్రంలో లెక్చరర్ పదవికి ఇంటర్వ్యూయకు హాజరయినప్పుడు, ప్రొఫెసర్లకు కూడ లేని అర్హతలు ఆయనకు ఉన్నాయని ఇంటర్వ్యూ కమిటీ అభిప్రాయపడిందని చెప్పుకునేవారు. అప్పటికే ఆయన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసి, రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీలో గణితశాస్త్రంలో ఎంఎస్‌సి (1977) చేసి,



**ఆయన వ్యక్తిగతంగా నాకు గురువు, మిత్రుడు, మార్గదర్శి, జీవనదాత. 1988 మార్చ్‌లో నేను ఒక రోడ్డు ప్రమాదానికి గురయి చావు బతుకుల మధ్య ఉండినపుడు, పోలీసులు చేర్చిన ఆస్పత్రిలోనే ఉంటే బహుశా చచ్చిపోయి ఉండేవాడినే. అక్కడ వైద్యం సరిగా లేదని, వాళ్లతో పోట్లాడి, ఏమైనా చేసుకోండి అని నన్ను భుజాన వేసుకుని మరో ఆస్పత్రికి చేర్చి నన్ను బతికించినది బాలగోపాలే.**

ఢిల్లీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్టాటిస్టిక్స్‌లో పోస్ట్ డాక్టోరల్ రిసర్చ్ చేస్తూ 1980లో వదిలేసి వచ్చారు. స్టాటిస్టిక్స్‌కు చెందిన అంతర్జాతీయ ప్రామాణిక పత్రికలలో పరిశోధనా పత్రాలు రాశారు. అమెరికన్ మాథమాటికల్ సొసైటీ పత్రికకు సమీక్షా సంపాదకుల బృందంలో ఉన్నారు. అంటే మూడు పదుల నిండకుండానే ఆయన ఇటు గణితశాస్త్రంలో అపారమైన ప్రజ్ఞ మాత్రమే కాక, క్రికెట్, సంగీతం, సినిమాలు, సాహిత్యం వంటి విభిన్నమైన, వైవిధ్యభరితమైన ఆసక్తులలో కేవలం ప్రవేశమే కాదు, ప్రావీణ్యం సంపాదించి ఉన్నారు. అప్పటికే మార్క్సిస్టు ప్రామాణిక గ్రంథాలు చదివి మార్క్సిజాన్ని ఒక శాస్త్రంగానూ, ప్రజాసమస్యల పరిష్కారమార్గం గానూ నమ్ముతున్నారు. ఆయనే 1987లో జెంటిల్ మన్ పత్రిక ఇంటర్వ్యూలో చెప్పినట్టు, ఆర్ఇసిలో పిఎచ్‌డి చేస్తున్న కాలంలో అమరుడు సూరపనేని జనార్ధన్ వంటి రాడికల్ విద్యార్థుల కార్యక్రమాలు, వరంగల్ ప్రజాచైతన్యం, ఎమర్జెన్సీ నిర్బంధం చూస్తు, అసలు వీళ్లు చెప్పే మార్క్సిజం ఏమిటో తెలుసుకోవాలని కాపిటల్ చదివేశారు.

1981 మార్చ్‌లో కాకతీయ విశ్వవిద్యాలయ గణిత శాఖలో లెక్చరర్‌గా చేరి, అప్పటి నుంచే సృజన సాహితీ మిత్రులతోనూ, పౌరహక్కుల సంఘంతోనూ పనిచేయడం మొదలుపెట్టారు. 1983లో పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1980 నుంచీ కూడా ఆయన వరంగల్ సామాజిక జీవితంలో అతి ముఖ్యమైన వ్యక్తిగా, ఎందరికో తలలో నాలుకలా, మిత్రుడిగా, ఆత్మీయుడిగా ఎదిగారు. ఆ రోజుల్లో ఆయన సహాయం పొందని వరంగల్ ప్రజా ఉద్యమ కార్యకర్తలు ఒక్కరు కూడా లేరంటే అతిశయోక్తి కాదు. ప్రతి రాడికల్ విద్యార్థి యువజన కార్యకర్తకూ ఆయన తమకు రక్షణగా ఉన్నాడనే, భరోసా ఉండేది. జిల్లాలో అప్పుడు విస్తరిస్తున్న రైతాంగ ఉద్యమం ఆయనను తన మిత్రుడిగా, మార్గదర్శిగా, ప్రచారకుడిగా ఆత్మీయంగా తీసుకుంది. అందుకే పాలకవర్గాలకు, పోలీసులకు ఆయన పేరే కంటగింపయింది. 1985లో పోలీసు ఇన్‌స్పెక్టర్ యాదగిరిరెడ్డి శవయాత్ర డా.రామనాథం ఆస్పత్రి మీదుగా వెళ్లడంతో డాక్టరు గారి హత్య జరిగిందిగాని, ఆ ఊరేగింపులో 'బాలగోపాల్ ను చంపుతాం' అని పోలీసులు నినాదాలు ఇచ్చారు. అప్పటికాయన హనుమకొండలో రాగన్నదర్వాజలోని ఒక చిన్న గదిలో ఉంటున్నారు. ఇక వరంగల్‌లో ఉండలేని పరిస్థితి వచ్చాక నాలుగైదేళ్ల పాటు పేరుకు హైదరాబాద్‌లో గది ఉన్నా రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి వెళ్లేవారు. తర్వాత హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పడి, న్యాయవాద వృత్తి మొదలు పెట్టినా ప్రతి శని ఆదివారాలు ఎక్కడికో ఒకచోటికి వెళ్లి ప్రజాసమస్యల అధ్యయనాలు, సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. మార్క్సిస్టు దృక్పథం నుంచి దూరమయ్యానని తానే రాసినా, పౌరహక్కుల సంఘంలో చర్చ ఫలితంగా మానవహక్కుల వేదిక ఏర్పాటు చేసినా ఆయన

తనకోసం తాను నిర్వచించుకున్న పనిని, సమాజమూ కాలమూ తన నుంచి ఆశించిన పనిని ఎన్నడూ వదిలిపెట్టలేదు.

బహుముఖ ప్రజ్ఞ, విస్తారమైన అధ్యయనం, నిరంతరమైన పని, అత్యంత నిరాడంబరమైన జీవనశైలి నిండిన బాలగోపాల్ ఆలోచనల నుంచీ, రచనల నుంచీ, ఆచరణ నుంచీ, పని విధానం నుంచీ నేర్చుకోవలసినవి ఎన్నో ఉన్నాయి. బహుశా తెలుగు సామాజిక కార్యకర్తలలో ఆయన మొదటిసారి ప్రారంభించిన సంప్రదాయాలూ ఉన్నాయి. తెలుగులో ప్రజా ఉద్యమాలు, ఉద్యమకారులు రచనలు, ఉపన్యాసాలు చాలవరకు ఆలంకారిక శైలిలో, ఉత్తేజపరిచే లక్ష్యంతో ఉండడమే ఎక్కువ అలవాటు. కాని ప్రజా ఉద్యమాల ఆలోచనలు విషయ పరిజ్ఞానంతో, వాదనాపటిమతో, విశ్లేషణా శక్తితో, ఇతరులను, ముఖ్యంగా ఆ సమస్య గురించి అవగాహన లేని వాళ్లను ఒప్పించ గల నేర్పుతో ఉండాలనేది ప్రధానంగా బాలగోపాల్ ఇచ్చిన కానుకే. విశాల ప్రజాసమస్యల పట్ల అధ్యయనం లేకుండా ఊకదంపుడు మాట్లాడగూడదని, ఆ సమస్యలను స్థూల స్థాయిలో మాత్రమే కాక, సూక్ష్మస్థాయిలో అధ్యయనం చేయాలనీ ఆయన తన ఆచరణ ద్వారా చెప్పారు. సాధారణంగా ప్రజా ఉద్యమాలు తమవాళ్లనే ఉద్దేశించే మాట్లాడుతూ, ఇదివరకే పరివర్తన పొందినవారిని పరివర్తన చెందించడానికి ప్రయత్నిస్తుండగా, ఆయన కొత్తవారినీ, తటస్థులనూ ఆకట్టుకోవడానికి ప్రయత్నించి విజయం సాధించారు.

ఇలా కొత్త వారిని ఆకర్షించడం అనేది కేవలం సంఖ్యా బలాన్ని పెంచడానికి మాత్రమే కాదు, అసలు అవగాహనలోనే ప్రజా ఉద్యమం అనేది అత్యంత సూక్ష్మమైన సమస్యలను కూడ పట్టించుకుని, ఆ చిన్న చిన్న పోరాటాలను కూడా ఏకం చేసి మహాప్రవాహం కావాలని ఆయన విశ్వసించారు. అందువల్లనే ఆయన కృషి పౌరహక్కుల ఉద్యమ పరిధిని విస్తృతం చేయడం దిశగా సాగింది. కేవలం రాజ్యహింస, రాజ్యాంగ బద్ధమైన హక్కుల పరిరక్షణ మాత్రమే కాక, అన్ని ఆధిపత్య శక్తులు సాగించే హక్కుల ఉల్లంఘనల మీద మాట్లాడాలని ఆయన పరిధిని విస్తృతపరచడం మొదలుపెట్టారు. అలా పౌరహక్కుల ఉద్యమం 1980లో అనేక కొత్త సమూహాలలోకి, సమస్యలలోకి, ప్రాంతాలలోకి విస్తరించింది. ఆ వాదనను ఆయన ప్రజా ఉద్యమ నిర్మాణాలు కూడా ఆధిపత్య శక్తులు కాగలవనే వాదనలోకి, వారి ఉల్లంఘనలను కూడ ఖండించాలనే దగ్గరికి తీసుకుపోయారు గాని, అయినా ప్రజల సమస్యలపై ఉద్యమాలను మాత్రం సంపూర్ణంగా సమర్థిస్తూనే వచ్చారు.

పౌరహక్కుల ఉద్యమంతో పాటు సాహిత్య విమర్శ, చరిత్ర, తత్వశాస్త్రం, విజ్ఞానశాస్త్రాలు, సమకాలీన రాజకీయార్థిక పరిణామాలు, మొదలయిన ఎన్నో విషయాల మీద ఆయన సాగించిన రచనలు, అద్భుతమైన సమాచార, విశ్లేషణా సంపదతో నిండిన వక్తృత్వం, పదునైన వ్యంగ్యం వంటి అపారమైన కృషి ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే మేధావి – కార్యకర్త అనేవి



**యాభై ఏడు సంవత్సరాల జీవితంలో, తొలి ఇరవై ఐదు సంవత్సరాలు చదువుకు పోయినా, మిగిలిన ముప్పై సంవత్సరాలకు పైగా ఆయన సాధించిన విస్తృతి, సాగించిన కృషి చూస్తే ఒక మనిషి, ఇంత జీవితకాలంలో ఇన్ని సాధించగలరా అని ఆశ్చర్యం వేస్తుంది. బహుముఖ ప్రజ్ఞ, విస్తారమైన అధ్యయనం, నిరంతరమైన పని, అత్యంత నిరాడంబరమైన జీవనశైలి నిండిన బాలగోపాల్ ఆలోచనల నుంచీ, రచనల నుంచీ, ఆచరణ నుంచీ, పని విధానం నుంచీ నేర్చుకోవలసినవి ఎన్నో ఉన్నాయి.**

ఒకదానికొకటి సంబంధం లేని ద్వంద్వాలనీ, మేధావి అని పేరు వచ్చిన వారు పనిచేయరనీ, కార్యకర్తలు మేధోకృషి సాగించలేరనీ ఉన్న దురభిప్రాయాన్ని ఆయన తన జీవితాచరణతో రద్దు చేశారు.

1980లో సృజనలో ఆర్ఎస్ సుదర్శనం రాసిన మార్క్సిజం – సాహిత్యం పై త్రిపురనేని మధుసూదనరావు విమర్శ రాయగా, దానిమీద చర్చ జరిగింది. ఆ చర్చలో పాల్గొంటూ రాసిన వ్యాసం బాలగోపాల్ మొదటి తెలుగు వ్యాసం కావచ్చు. ఆ తర్వాత కొన్నాళ్లకే ఆర్ఇసి క్వార్టర్స్ లో మిత్రుడి ఇంట్లో ఉంటూ ట్యూషన్లు చెప్పుకుంటూ ఉండిన రోజుల నుంచీ 30 సంవత్సరాల అనుబంధంలో లెక్కలేనన్ని అనుభవాలు. ఆయన వ్యక్తిగతంగా నాకు గురువు, మిత్రుడు, మార్గదర్శి, జీవనదాత. 1988 మార్చిలో నేను ఒక రోడ్డు ప్రమాదానికి గురయి చావు బతుకుల మధ్య ఉండినపుడు, పోలీసులు చేర్చిన ఆస్పత్రిలోనే ఉంటే బహుశా చచ్చిపోయి ఉండేవాడినే. అక్కడ వైద్యం సరిగా లేదని, వాళ్లతో పోట్లాడి, ఏమైనా చేసుకోండి అని నన్ను భుజాన వేసుకుని మరో ఆస్పత్రికి చేర్చి నన్ను బతికించినది బాలగోపాలే. అంతకు రెండు సంవత్సరాల ముందు నా జీవితంలో ఒక ముఖ్యమైన మార్పు ఆయనతో చర్చించి తీసుకున్న నిర్ణయమే. ఆయన అభిప్రాయాలతో తీవ్రమైన విభేదం వచ్చినప్పుడు ఆయనను విమర్శిస్తూ పుస్తకమే రాసినప్పటికీ ఆయన అపారమేధోశక్తి ముందు, ఆయన అకుంఠిత దీక్ష ముందు, అవిశ్రాంతమైన ఆయన పనిముందు ఎప్పుడూ వినమ్రుడినై ఉన్నాను. అక్టోబర్ 9 సాయంకాలం పంజగుట్ట శ్మశానవాటికలో కట్టెల పరుపు మీద ఆయన చేతిని ఆఖరిసారి ముట్టుకుని ఆ వినమ్రత ప్రకటించాను.

ఆయన నుంచి నేర్చుకుని, ఆచరణలో పెట్టినప్పుడే ఆయనలేని లోటు కొంతయినా తీరుతుంది.



సి.హెచ్.వి. ప్రభాకరరావు
(సీనియర్ జర్నలిస్ట్, జగిత్యాల)

# మహోన్నత వ్యక్తి బాలగోపాల్

**"మనిషి గొప్పతనం రాజకీయ అధికారంతోనో లేదా ధనంతోనో కాదని, తన నడవడికతో - తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ప్రజాహితం కొరకు తాను చేసే కృషిలోనే మనిషి ఎదుగుతాడని నమ్మి - ఆచరించి - నిరూపించిన మహోన్నత వ్యక్తిత్వం గలవాడు బాలగోపాల్."**

పేరులో బాలుడైనా - ప్రజాహితం కొరకు - దేన్నైనా ఎదురించడానికి సిద్ధపడ్డ బాలగోపాల్ నేటి వ్యాపార ప్రపంచంలో ప్రజలు సహజంగా పొందిన హక్కులను కాపాడడంలో ప్రజా ప్రభుత్వాలు చేసిన, చేస్తున్న ఎన్నో అక్రమాలను బయట పెట్టడానికి "ఏక వ్యక్తి సైన్యంగా" ముందుకు సాగాడు.

హక్కుల సంస్థలు అంటే ప్రభుత్వ వ్యతిరేకంగా వ్యవహరించే విప్లవ సంస్థల - అనుబంధ సంస్థలు అనే అపప్రదను రూపుమాపి, ప్రజల హక్కులను, అవి సహజమైనవి కాని, రాజ్యాంగ ప్రతిపాదితం కాని - వేటికైనా - ఆటంకం - అడ్డు - ఏర్పడితే ఎదుర్కొవాలని - వాటిని హరించేవారు - ఫాక్షనిస్టులైనా, రాజకీయ నాయకులైనా, విప్లవ కారులైనా- ప్రభుత్వం అయినా ఎదురు తిరగాలని, తమ హక్కులను సాధించుకోవాలని ప్రజలను చైతన్య పరుస్తూ, వారికి అండగా నిలబడడంలో బాలగోపాల్‌కు సాటిగా మరొకరు ఎవరూ ముందుకు రాలేదనడం అతిశయోక్తి కాదు.

**_భావాలు - ఆచరణ_**

మావో-లెనిన్ భావాలతో ప్రభావితం అయినా, నక్సలైట్ ఉద్యమంతో మమేకం అయినా "వ్యక్తి స్వేచ్ఛ" - స్వాతంత్ర్యాలకు భంగం కలిగించేవారు ఎవరైనా ఒకే రీతిలో ఎదుర్కొవడానికి సిద్ధపడడం ఆయన లక్షణం.

ప్రకృతి సహజంగా అందరికి వచ్చిన హక్కులను రక్షించడానికే మనం ఏర్పాటు చేసుకొన్న రాజ్యం-రాజ్యాంగం మన హక్కులకు భంగం కలిగించే రీతిలో ప్రవర్తిస్తే ఎదుర్కోవడం అందరి లక్ష్యం, కర్తవ్యం కావాలి. కాని వ్యాపారం-వినిమయ జీవన విధానంలో ఉన్నవాడి మాటే చెల్లుబాటు అవుతూ, సామాన్యుల జీవన హక్కులకు భంగం కలిగించే వ్యాపార సంస్థల ధోరణులను అడ్డుకొని, వాటి పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంలో బాలగోపాల్ చేసిన కృషి అద్వితీయం.

**_జీవించే హక్కు-ఒక్కటే_**

మానవ హక్కులు-పౌర హక్కులు-అన్ని ఒక్కటే. ముఖ్యంగా ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రభుత్వాల అప్పుల వేటలో వలసవాద రాజకీయ అగ్రదేశాల వ్యాపార కాంక్షకు అనుగుణంగా కొత్త వలన ప్రాంతాల ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం ప్రారంభించిన ఆర్థిక మండళ్ళ ఏర్పాటులను వ్యతిరేకించడమే కాకుండా ఆయా ప్రాంత రైతులతో ప్రజలతో మమేకం అయి, వారికి అవగాహన కల్పించి, హక్కుల కొరకు ఏర్పాటు చేసిన వీరుడు, ధీరుడు బాలగోపాల్.



**యవ్వనంలో సైకిల్‌పై, అంగడి వీధులలో తోపు బళ్ళలో వ్యాపారం చేసుకునే వ్యక్తులు ఆరు పదులు వయసులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కట్టడి చేసే ప్రభావిత స్థాయికి ఎదిగాడంటే - మన వ్యవస్థలో ఎంత లోపం ఉందో తెలుస్తుంది. యిలాంటి పరిస్థితులను సరిదిద్ది అందరికి న్యాయం జరగాలంటే ఇంటికొక్క బాలగోపాల్ పుట్టాలి. మనిషి మంచితనం - చేసే పనులలోని గొప్పతనం మనిషి చస్తే కాని తెలియదనే మాట ప్రచారంలో ఉంది. అది నిజంగా బాలగోపాల్ విషయంలో నిజమౌతుందా ?**

రాజకీయ నేపథ్యాలకు అతీతంగా- కుడి ఎడమల రాజకీయ పార్టీల నాయకులంతా ఈనాడు బాలగోపాల్ వ్యక్తిత్వాన్ని, ఆయనలోని సేవా నిరతిని, నిబద్ధతను తెలుగు భాషలోని అనేకానేక విశేషణ పదాలతో కొనియాడుతూ-నివాళులు అర్పిస్తున్నారు. ఆయన మార్గాన్ని కొనసాగించాలని ప్రబోధిస్తున్నారు. చాలా సంతోషం. కాని ఆయన ఉన్న కాలంలో - ఆయన చేసిన పోరాటాలు వీరికి కాన రాలేదా ? ఎందుకు ఆయన ఒంటరిగా - ఆచరణలో నిజంగా ఒంటరిగా సామాన్య ప్రజల కొరకు పోరాడాల్సి వచ్చిందో వీరికి తెలియదా ?

మనిషి మంచితనం - చేసే పనులలోని గొప్పతనం మనిషి చస్తే కాని తెలియదనే మాట ప్రచారంలో ఉంది. అది నిజంగా బాలగోపాల్ విషయంలో నిజమౌతుందా ?

***రాజకీయాలు భక్షణకా***

ప్రజలు తమ యోగక్షేమాలు చూడాలని ఎన్నుకొన్న ప్రతినిధులకు - ప్రజల బాగోగులు అవసరం లేదా - రాజ్యాంగం ఏర్పరచిన హక్కులను - కాపాడడానికి ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు మానవ హక్కులను కాపాడలేరా ?

మన హక్కులకు రక్షణగా ఉండాలనే కదా మనం రాజ్యాన్ని - రాజ్యాంగాన్ని ఏర్పరచుకొన్నది. మరి అలాంటి ప్రభుత్వమే - వాటిని నడిపే నాయకులు - ప్రజా హక్కులను కాలరాస్తుంటే ఈ ప్రభుత్వాలు ఎవరికొరకు ఉన్నాయి ?

ప్రజలలో కూడా రెండు రకాల ప్రజలు ఉంటారా ? అధికారంతోనో, విద్యతోనో - అంగబలం తోనో, ఆర్థిక బలంతోనో యితరుల హక్కులను కాలరాజేవర్గం - ఒకవైపు ఉండి, బలహీనులైన వారిపై పెత్తనం చెలాయిస్తుంటే బలి పశువులుగా మారుతున్న ప్రజలు - ఈ రాజ్యాంగంలో రాజ్యంలో భాగంగా తమకు రావాల్సిన సహజ న్యాయం పొందడానికి మళ్ళీ పోరాటం చేయాలా ? అలా పోరాటం చేయడానికి రాష్ట్రం మొత్తానికి ఒక బాలగోపాల్ లాంటి వ్యక్తి అవసరం ఏర్పడడం - ఆయన పోరాట పటిమను మన స్ఫూర్తిగా పొందాలని - సంతాప ప్రకటనలు చేయడం నిజంగా మన ప్రజల దురదృష్టం.

వేల ఏళ్ళ చరిత్ర కల్గిన మానవ జాతిలో ఈనాటికి సహజ న్యాయం అందకుండా పోతుందంటే దానికి కారణం ఎవరు ? అనాగరికంగా కొండ కోనలలో జీవించే గిరిజనులా ? లేక బాగా చదువు కొని, డబ్బు సంపాదించిన సంపన్న వర్గాలా ? యింకా తాడిత - పీడిత వర్గాల ప్రతినిధి బాలగోపాల్ అని మనం మాట్లాడుతున్నామంటే మన ఈ సామాజిక వ్యవస్థకు ప్రతినిధులైన అందరం సిగ్గుతో తలవంచుకోవాలి.

పీడిత వర్గాల, అణగారిన వర్గాల వారందరికి సామాజిక న్యాయం- సహజ న్యాయం అందిస్తామని - 60 ఏళ్ళ సామాజిక పరిస్థితులు లేకుండా - ఆటవిక న్యాయం మాత్రమే అందిస్తుందంటే - బాలగోపాల్ లాంటి యోధులు ఎంత మంది కలిస్తే - మన రంగుల కల ఫలిస్తుంది.

రాజకీయాల పేర - ప్రజల పేరిట - ప్రజల కొరకు - ప్రజల వలన మూడెకరాల ఆసామి ముప్పది వేల కోట్లు ఆస్తులు కూడబెట్టుకొని, రాజ్యాధినేతగా వెలిగిపోతుంటే అది ఆయన నాయకత్వ ప్రతిభ - వ్యాపార లక్షణం - మహోన్నత నాయకుడు అని వందిమాగధులు లాగా కీర్తించే ఈనాటి రాజకీయ మేధావులున్నంత కాలం - బాలగోపాల్ లాంటి వ్యక్తుల జీవితాలు - పోరాటానికే అంకిత మవుతాయి.

యవ్వనంలో సైకిల్‌పై, అంగడి వీధులలో తోపు బళ్ళలో వ్యాపారం చేసుకునే వ్యక్తులు ఆరు పదులు వయసులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కట్టడి చేసే ప్రభావిత స్థాయికి ఎదిగాడంటే - మన వ్యవస్థలో ఎంత లోపం ఉందో తెలుస్తుంది. యిలాంటి పరిస్థితులను సరిదిద్ది అందరికి న్యాయం జరగాలంటే ఇంటి కొక్క బాలగోపాల్ పుట్టాలి.

**నైజం - యిజం - ఒక్కటే**

బాలగోపాల్ నైజం-యిజం - నేటి ప్రపంచానికి ప్రత్యేకం అయినవి. ఆయన జీవితం అనేక తత్వ శాస్త్ర సిద్ధాంతాలకు అతీతం. ఆయనే ఒక వేదాంతి. సిద్ధాంత కర్త - జీవిత తత్వాన్ని - ఆచరించి- బోధించిన ప్రవక్త. ఆయన వ్యక్తిత్వాన్ని - పోరాట పటిమను ఏ భాషలోని పదాలలో యిరికించలేము. ఆయన జీవిత విధానం, ఆచరించిన పద్ధతులు - ఎంత నిడారంబరంగా ఉన్నాయో అందరికి తెలుసు. గెలిచినవాడే వీరుడంటే - అతన్ని వీరుడుగా చేయడానికి ప్రాణాలొడ్డిన వారిని ఏమనాలి? ఒకరికి విజయోత్సాహాన్ని యివ్వాలంటే మరెందరో త్యాగం చేయాలి.

**త్యాగమే-విజయం**

అలా అణగారిన వర్గాల వారికి, హక్కులు లేని వారికి, పోగొట్టుకున్న వారిని విజేతలుగా నిలపడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన "మహా మనీషి" బాలగోపాల్.

ఆయన ఆశయం అందరు సంతోషంగా ఉండాలని, అందరికి సమాన హక్కులు - అవకాశాలు ఉండాలని. ఆయన ఆశయాలను కొనసాగించడం అంటే నేటి రాజకీయాలను ప్రక్షాళన చేయాలి. రాజకీయ నాయకుల ఆలోచనలలో-వ్యవహార సరళిలో మార్పు రావాలి.

ఆయనకు నివాళులు అర్పించిన అన్ని వర్గాలు రాజకీయ నాయకులు-ఆయన మరణం నుండి ఏమి ఆశించి నివాళులు అర్పిస్తూ సందేశాలు యిచ్చారో కాని ఆయన దేనికొరకు తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసాడో తెలుసుకోవాలి.

ఒకనాటి ఆయన సహచరులు నేటి రాజకీయ నాయకులు - మేధావులు అందరు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. "బాలగోపాల్" ఒక్కడే ఎందుకు ఈ స్థాయిలో పోరాడాల్సిన అవసరం వచ్చింది. ఈ వ్యవస్థలోని మిగతా వర్గాలను ఎందుకు వ్యతిరేకించాల్సిన దుస్థితి వచ్చింది.

ఒక మేధావిగా బాలగోపాల్‌ను గౌరవించడం ఆయన సంతాప సభలు -సందేశాలు కావు ఆయన కోరుకున్నవి.

తమ ఆధిపత్యం కోరుకుని హింస-ప్రతి హింసను ప్రోత్సహించేవారు - వారికి రాజకీయ రంగు పులిమేవారు. వాటిని అందంగా మలిచి ప్రచారం చేయగలిగే వారితోనే సమస్య.

సహజ న్యాయం - సామాజిక న్యాయం - రాజ్యాంగ హక్కులు - సామాజిక హక్కులు - మరో హక్కు - మరో హక్కు - ఏదైనా - అందరికి కావల్సింది సంతోషంగా జీవించడం. అందులో మళ్ళీ సామాన్యులని, ధనికులని, నాయకులని - మరొకటని - మరొకటని - వేరు వేరు వాదనలు- ప్రతిపాదనలు - దేనికి ?

గాలి పీల్చడంలో - ఎన్ని వర్గాలు ఉన్నాయి ? నీళ్ళు త్రాగడంలో వేరు వేరు పద్ధతులు ఉన్నాయా? మరి లేనపుడు ఈ వర్గాలను సృష్టిస్తున్న మేధావి వర్గాన్ని ప్రశ్నించండి బాలగోపాల్ ఆశయం ఏమిటి? ఎందుకు యింత సామాన్య జీవితం గడిపిన వ్యక్తి ఎందరికో ఆరాధ్యుడు అయ్యాడు.

**యువతకు ఆదర్శం**

నేటి యువతను బాలగోపాల్ లాంటి వ్యక్తిత్వంతో తీర్చిదిద్దడానికి కృషి చేయాలి. మా తాతలు నేతులు తాగారన్న జ్ఞాపకాలలో జీవించేవారికి, యింటర్నెట్‌తో-కంప్యూటర్ పరిజ్ఞానంతో వేలు-కోట్లు సంపాదించి - చంద్రమండలంలో విహరిద్దామనుకునే వారికి కనువిప్పు కలిగించాలి.


మైక్రోసాఫ్ట్ అధినేత - అమెరికా అధ్యక్షుడు లేదా భారత ప్రధానే కాదు - బాలగోపాల్ లాంటి సామాన్యులే అసామాన్యులుగా ఎదిగి సమాజాన్ని - "నిజమైన సమాజాన్ని" నిర్మించగలుగుతారు. అంతేకాని తాత్కాలిక ఆనందాలకు పాటుపడేవారు - స్వంత వ్యాపారాలు - రాజకీయాలు చూసుకునే వారు ఎంతగా "ఆర్జించిన కీర్తి" అది తాత్కాలికమే...

అన్ని భోగ భాగ్యాలు అనుభవించాలి. - "కామి గానివాడు మోక్షగామి కాదయా'' అన్న వేమన- చివరకు ఏ దశకు చేరుకున్నాడు ? శరీరానికి బట్టకట్టుకోడం కూడా వృధా అన్నాడు. ఎందుకు- మనసంతా మాలిన్యంతో ఉంటే - శరీరమంతా యితరుల హక్కులను హరించిన దుర్గంధ పూరిత కంపు కొడుతుంటే పై పైన వేసుకొన్న ఈ ముసుగు లాంటి బట్టలు - మనిషి అంతర్యాన్ని కప్పి పుచ్చలేవని.

అందుకే నిరంతర పోరాట పటిమతో ముందుకెళ్ళిన బాలగోపాల్ - ఆశయాలను కొనసాగించాలని ప్రబోధించేవారు - ఆచరించాలనుకునేవారంతా తమలోని కంపును-మానవత్వం అనే యింపుతో కడిగేసుకొని ముందుకు సాగాలి.

నిజంగా నేటి రాజకీయ నాయకులలో ముఖ్యంగా యువకులలో తమ జీవితాల పట్ల తమకు విశ్వాసం - ఆత్మస్థయిర్యం ఉంటే బాలగోపాల్ లోని చిత్తశుద్ధి, నిబద్ధత సాధించడం అంత కష్టం కాదు. అలాంటి యువతరం ముందుకు వస్తుందని ఆశించడమే - బాలగోపాల్‌కు నిజమైన నివాళి.

**షహనాజ్**




**ఆయనేమీ బ్రహ్మాండాలనేమీ బద్ధలు చేయలేదు. కొండలను పిండి చేయలేదు. కానీ ఆయన మరణించాడని తెలియగానే మానవ హక్కులు మూగబోయాయి. హక్కుల సాధన కోసం ఆయన నిరంతరం పోరాడేవారు. ఇప్పుడు హక్కుల్ని గురించి అడిగేవారు ఏరని ఇక రారేమోనని బడుగు,బలహీనవర్గం కంటి నిండా నీళ్లు నింపుకొని జలజలా కారుస్తూ కన్నీరు పెడుతోంది. ఆయన నేటి తరం బుద్ధుడు గౌతముడు రాజరికంలో పుట్టి, సకల సౌకర్యాలు అనుభవించి, విలాస జీవితాన్ని రోసి సామాన్య జీవితంలోకి వెళ్లి శోధించారు. బాలగోపాల్ కూడా అంతే పండిత వంశంలో పుట్టి, అన్నింటిని కాదని, సామాన్యుడిగానే వెళ్లి పేదలకోసం అహరహం తపించారు. అందుకే ఆయన గౌతమబుద్ధుడయ్యారు. పేదలంటే ఆయనకు విపరీతమైన ప్రేమ, అందుకే ఆయన పేదల పక్షమే నిలిచేవారు. పేదలకు న్యాయం దక్కడం కోసం ఆయన ఉద్యమాలనే వ్యాపకంగా చేసుకున్నారు. ఉద్యమాలకు ఒక ఉత్తమ, ఉన్నత స్థాయికి తీసుకొని, ప్రపంచ మానవహక్కుల చరిత్రలో తొలి ఫుల్ టైమర్‌గా వాసికెక్కిన వ్యక్తి బాలగోపాల్ మరణం చాలా మందికి ఖేదాన్ని కలిగించింది.**

ప్రపంచ మానవ హక్కుల ఉద్యమకారుడు, అసాధారణ ప్రజ్ఞ, కార్యశీలత, కలబోసిన వ్యక్తిత్వమున్న మేధావి, మాన హక్కుల ఉద్యమకారుడు, మార్క్సిస్టు విశ్లేషకుడు, తత్త్వవేత్త, గొప్ప మానవతావాది, న్యాయవాది, రచయిత అన్నీ ఆయనలో ఇమిడి వున్నాయి.

చింతన, కృషి, వ్యక్తిత్వం బహుముఖాలుగా విస్తరించాయి. ఉద్యమ జీవితంలో సాహిత్యం, సమాజం, చరిత్ర, రాజనీతి శాస్త్రం, న్యాయశాస్త్రం తదితర రంగాల్లో ఆయన విస్తృతమైన అధ్యయనం సాగించారు. సూక్ష్మమైన రీతిలో ఈ అధ్యయనం కొనసాగుతుంది. ఈ అంశాలను పరిశీలించి అదే పద్ధతిలో రచనలు సాగించారు.

సాధారణ స్థాయిలో మానవహక్కుల స్పృహ కల్పించడమేకాదు. మధ్య తరగతి మేధావి వర్గాన్ని ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కల్పించడమే బాలగోపాల్ పద్ధతి. ఆయన చాలా వరకు దీన్ని సాధించారు.రాజ్యమే ఒక పక్షం వహించి, ఇతర పక్షాలపై ఉల్లంఘనకు పాల్పడినప్పుడు, దాన్ని ఎదుర్కొనే యంత్రాంగం, వ్యవస్థలు లేకపోతే ఆ లోటును పూడ్చాల్సిన బాధ్యత పౌర హక్కులకు ఉందని బాలగోపాల్ అభిప్రాయపడేవారు. పౌర హక్కుల సమస్య అనేది విప్లవోద్యమాలకు సంబంధించిన సమస్య కాదు. అందరి సమస్య. అన్ని వర్గాల హక్కుల ఉల్లంఘన జరిగితే వాటిపై ఉద్యమించాలని బాలగోపాల్ అభిప్రాయపడేవారు. రాజ్యం అణచివేతకు, హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా బాలగోపాల్ అవిశ్రాంత పోరాటం చేశారు.


మానవహక్కుల ఉద్యమలో మానవహక్కులను, విలువలను పరిరక్షించే స్వతంత్ర రాజకీయ శక్తిగా వుండాలన్న విషయమై

ఆయన స్వతంత్ర వ్యవస్థకోసం ఎపిసిఎల్‌సి నుండి వైదొలిగి, మానవ హక్కుల వేదికను స్థాపించారు. పౌరహక్కుల ఉద్యమంపై ఆయనకు కొన్నాళ్లుగా భేదాభిప్రాయాలుండేవి. మావోయిస్టు లేదా నక్సలైటు ఉద్యమ కారులు తుపాకీగొట్టం ద్వారా రాజ్యాధికారం, హింస విషయంలో ఆయన వ్యతిరేకిస్తూ వుండేవారు. ప్రభుత్వ హింస,ప్రైవేట్ హింసవల్ల మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందన్న భావన రాగానే ఆయన ఎపిసిఎల్సీ నుండి వైదొలిగారు.

ఎన్‌కౌంటర్ జరిగినప్పుడు పోలీసులను నిందితులుగా గుర్తించి,వారిని బోనులో నిల్చోబెట్టి దర్యాప్తు చేయాలని బాలగోపాల్ వాదించారు. దీనికి న్యాయస్థానం కూడా పోలీసులపై విచారణ,దర్యాప్తు జరుపడానికి అంగీకరించడం పౌర,మానవ హక్కుల చరిత్రలో మరో ఘట్టంగా చెప్పుకోవచ్చు. పాతబస్తీకి చెందిన మైనార్టీలపై ఉగ్రవాద అభియోగాలను మోపినప్పుడు అమాయకులకు బాలగోపాల్ న్యాయసహాయం అందించారు. రాయలసీమ ఫ్యాక్షన్ సంస్కృతిని ఆయన వ్యతిరేకించారు. ఎపిసిఎల్సీనేతగా ఆయన రాయలసీమ ఫ్యాక్షన్ హత్యల గురించి, పాలమూరు జిల్లా కరువు గురించి పుస్తకాలను వెలువరించారు. ఆయన ఏ సమస్యను వదల్లేదు. ఏ సంఘటన వల్ల మానవహక్కులకు ఉల్లంఘన జరుగుతుందని తెలుస్తే అక్కడ ఆయన ప్రత్యక్షమయ్యేవారు. చిత్తూరు జిల్లాలో ఏనుగుల బీభత్సం, ఇద్దరు, ముగ్గురు చనిపోయారన్న విషయం తెలుసుకోగానే అక్కడ ఆయన వాలిపోయారు. కాశ్మీర్ సరిహద్దుల్లో వుంచిన మందు పాతరలకారణంగా సామాన్యులు చనిపోతున్నారని తెలిసి అక్కడికి వెళ్లి, అధ్యయనం చేసి, దానిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం పేర పోలీసులు జరుపుతున్న మారణకాండను అక్కడికి వెళ్లి ప్రశ్నించారు.

గణిత శాస్త్రంలో బాలగోపాల్ దిట్ట. లెక్కలంటే అంకెలు కావని, సామాజిక శాస్త్రాన్ని గణితంలో కలిపి అధ్యయనం చేసే కొత్తపద్ధతిలో ప్రపంచానికి చూపడమే కాదు, దీన్ని ఆయన స్వయంగా ఆచరించి చూపారు.

బాలగోపాల్ గురించి ఎంత ఎక్కువ చెప్పినా అది తక్కువే అవుతుంది. సామాన్యుడిలో సామాన్యుడు,అసమాన్యుడులో అసమాన్యుడు. చేతి సంచిలో ఎంత దూరమైనా సాగిపోతారు. కంటికి కునుకు వుండదు. సుఖనిద్రను ఆయన కోరుకోరు. మంచి భోజనం తినాలని ఆయన అనుకోరు. మాసిన బట్టలు, చేతిలో పుస్తకాలతో, ఆయన ఎవరు పిలిచినా వెళ్తుంటారు. దేనికీ వెరువని, రాజీకి అంగీకరించని బాలగోపాల్ ఇలా గ్రామీణ ప్రాంతాలకు,అటవీ ప్రాంతాలకు వెళ్లే క్రమంలో సౌకర్యాల వ్యవహారాల్లో రాజీ పడిపోతుంటారు. దూరభారాన్ని నడిపోవాలన్నా, చివరకు సైకిల్‌పై ఎక్కి వెళ్లడానికి సంశయించరు. విశ్రాంతి తీసుకునే సమయంలో కనీసం కటికనేల అయినా చాలనుకునే సామాన్య జీవితాన్ని అనుభవించిన అసమాన్యుడు. అందుకే ఆయన్ను విప్లవ కవి,



## బయోడేటా...

| | | |
|---|---|---|
| **జననం** | : | 1952 జూన్ 10 |
| **పుట్టిన వూరు** | : | కర్నాటకరాష్ట్రం బళ్లారి |
| **స్వంత వూరు** | : | రాళ్ల అనంతపురం గ్రామం, కంబదూరు మండలం, అనంతపురం జిల్లా. |
| **తండ్రి** | : | పార్థనాధ శర్మ |
| **తల్లి** | : | నాగమణి |
| **చదువు** | : | స్వంత వూర్లో ప్రాథమిక విద్య |
| **ఇంటర్మీడియెట్** | : | నెల్లూరు జిల్లా కావలి |
| **డిగ్రీ** | : | ఎస్వీయు-తిరుపతి |
| **పిజి** | : | ఎమ్మెస్సీ మాథ్స్-కెయు వరంగల్ |
| **పిహెచ్డీ** | : | కెయు, వరంగల్ 1994లో లా పూర్తి చేశారు. ఢిల్లీ ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్‌లో ఉద్యోగం |
| **ప్రభావితం చేసినవాళ్లు** | : | కోశాంబి అధ్యయనం జనార్దన్ ఆచరణ |
| **ఉద్యమాల బాట** | : | విరసంలో చేరారు. 1983లో ఎపిసిఎల్సీ కార్యదర్శిగా పని చేశారు. |
| **ఉద్యోగం** | : | కెయులో మాథ్స్‌లో ప్రొఫెసర్ 1981లో వచ్చింది. |

1985లో ఉద్యమాలకు అడ్డుగా నిలిచిందని ఉద్యోగానికి రాజీనామాచేశారు.

సాహిత్య,సాంస్కృతిక ఉద్యమాల్లో సహచరుడు,మిత్రుడు వరవరరావు మహాత్ముడిగా అభివర్ణించారు. కానీ ఆయన అంతకన్నా ఎక్కువే. మహాత్ముడు కాదు..గౌతమ బుద్ధుడు. బుద్ధుడు ప్రాయమైన జీవితానికి రోసి,విలాస వంతమైన రాజరికాన్ని వదిలి, నిరాకారంగా జనారణ్యాన్ని వదిలిన బుద్ధుడు,జ్ఞాన సంపదన సముపార్జించారు. ఆయనలోని తత్త్వం బాలగోపాల్‌కు బాగా అలవడింది. అందుకే గౌతమ బుద్ధునిలోని నిరాకారతత్త్వం ఎక్కువగా కనిపిస్తుంది. అహింసాయుధాన్ని గౌతముడు కూడా ఉపయోగించారు. కానీ మహాత్మాగాంధీ ఈ ఆయుధంతో

తెల్లవారిని వెళ్లగొట్టారు. అందుకే మహాత్ముడయ్యారు. అదే బాలగోపాల్ రాజ్యహింసను, ప్రైవేట్ హింసను నిలదీశారు. దానికోసం పోరాడారు. బాధితుల పక్షాన నిలిచి ఉద్యమాలు చేశారు. అందుకే ఆయన మహాత్ముడికి ఆదర్శమైన గౌతమ బుద్ధుని లక్షణాలు బాలగోపాల్‌లో స్పష్టంఘా కన్పిస్తాయి.

ఒకే వ్యక్తితో ఇన్ని విశేషాంశాలు ఇమిడి వుండటం అసాధారణ ప్రజ్ఞ కిందే లెక్క. ఎప్పుడు సమయం చిక్కుతుందో తెలియదు. ఎప్పుడు పుస్తకాలను అధ్యయనం చేస్తారో అర్థం కాదు. సమకాలీన అంశాలపై ఆయనకున్న అపార విజ్ఞాన సంపదకు నెవ్వెర పోవాల్సిందే. ఎప్పుడో జరిగిన అంశాలను కూడా ఆయన విడమర్చి, విశ్లేషించి వివరించగలరు. అయితే తన జీవితంలో ఎంత పొదుపరో, మాటల విషయంలో కూడా అంతే పొదుపరి. అవసరమైన వాటి విషయాల్లోనే ఆయన మాట్లాడటం, ఆయన మాట్లాడే విషయాలు నలుగురికి ఉపయోగ పడతాయన్న భావనపైనే దృష్టి పెట్టడం, హక్కులకు సంబంధించిన విషయాలపైనే ఆయన ఎక్కువ అధ్యయనం చేయడంతో ఆయన్ను గొప్ప ప్రపంచ మానవ హక్కుల నాయకుడిగా నిలిపింది. రాష్ట్ర ప్రజలంతా దివంగత నేత వైఎస్సార్ హెలికాప్టర్ దారితప్పిందనే చింతాక్రాంతులై వుంటే, దాని కన్నా ఎక్కువగా ఈ ప్రమాదం వల్ల అక్కడి ఆదివాసీలకు ఎలాంటి ముప్పు వాటిల్లనుందోనని ఆ రాత్రంతా నిద్రపోని తత్త్వం ఆయనది. వైఎస్సార్ హెలికాప్టర్‌ను గాలించే క్రమంలో ఆదివాసీలకు పోలీసులు ముప్పు తీసుకు రావొచ్చునని ఆయన బాధపడ్డారు. నిరంతరం పేదల గురించి, పేదల ఈతిబాధల గురించి, గిరిజనులు, బడుగులు,మైనార్టీల సమస్యలపైనే ఆయన ఎప్పుడూ ఆలోచిస్తూ వుండేవారు. హైకోర్టు న్యాయవాదిగా కోర్టులోనే న్యాయసంబంధ వ్యవహారాలు మాట్లాడేవారు. కోర్టు ఆవరణ దాటగానే తాను న్యాయవాదిననే విషయాన్నే మరిచిపోయేవారు. బాలగోపాల్ తీర్పుల గురించి, వాజ్యాల గురించి కోర్టులకు వ్యతిరేకంగా ఎక్కడా మాట్లాడలేదని సుప్రీంకోర్టు న్యాయవాది జస్టిస్ సుభాషణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన్ను గరీబోళ్ల న్యాయవాదిగా పేరుంది. పేదలెవరైనా ఆయన వద్దకు వెళ్లి, న్యాయ సహకారం అందించాలని అడిగితే కోర్టు ఫీజులు కూడా పుచ్చుకోరు. ఉచితంగా కోర్టు పనులు పూర్తి చేశారు. ఆయన బతకడం కోసం న్యాయవాది కాలేదు. రాజ్యహింసను ప్రశ్నించడానికి న్యాయవాది అయ్యారు. ఉద్యమాల కోసం తాను చేస్తున్న అధ్యాపక వృత్తినే వదిలేశారు. రేపు గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. ఆలోచన రాదు. రేపెలా గడుస్తుంది. ఉద్యోగం లేకపోతే ఎలా అన్న ఆలోచన ఆయనకెప్పుడూ రాలేదు. వృత్తులు, ఇతర వ్యాపకాల ద్వారా ఉద్యమాలకు దూరం అవుతానే, పేదల హక్కుల కోసం పోరాడలేనన్న భావన అయన్ను ఎప్పుడూ బాధించేది.

పోలీసులు ఆయన్ను కిడ్నాప్ చేసినప్పుడు, దాడులకు పాల్పడ్డ క్రమంలోనూ ఆయన వెరువలేదు. ఆందోళనకు గురి కాలేదు. రాజ్యహింసకు వ్యతిరేకంగా ధునుమాడారే తప్ప, బాధ్యతల నుండి ఎప్పుడూ వైదొలగాలని ప్రయత్నించలేదు. ఆయనలో దేనికీ రాజీలేని మనస్తత్వం ఆయన్ను మరో మహాత్ముడిగా నిలిపింది. మరో అరవై ఏళ్లు గడిచినా చిత్తశుద్ధి,నిబద్ధత వున్న మానవహక్కుల ఉద్యమకారుడు ఇక రాడు కనిపించడు.

నిబద్ధత గురించి చెప్పాల్సి వస్తే ఆయన ఏ పనైనా ఒప్పుకున్నారంటే, అది పూర్తయ్యేదాక ఆయనకు నిద్రరాదు. నిద్ర పోరు... ఆయన ఎవరినీ నిద్రపోనివ్వడు. ప్రజాతంత్ర వారపత్రికకు ఆయన రెండు వందల వారాల పాటు 'నిగాహ్'కాలమ్ రాశారు. ఆయన మరణించేంతవరకూ ఆ శీర్షిక కొనసాగింది. ఎప్పుడైనా ఒకటీ రెండు సందర్భాల్లోనే ఆయన వ్యాసం మిస్సయ్యింది. ఉద్యమాల్లో తీరిక లేని సందర్భాల్లో పంపడం ఆలస్యం జరిగేది తప్ప,క్రమం తప్పేదికాదు. ఇక్కడో విషయాన్ని చెప్పాలి. ఒక సారి 'ప్రజాతంత్ర'కు వ్యాసం ఇవ్వాల్సివుంది. ఉదయమే బస్సుకు వెళ్లాలి. ఆ రాత్రి ఇంటికి చేరుకొని అంతకుముందే రాసి ఉంచిన వ్యాసం కవర్‌ను ఇంట్లో ఇచ్చి, ఇది 'ప్రజాతంత్ర'కు పంపించాలని చెప్పి,

## జర్నలిస్టుగా..



జర్నలిస్టుగా వరంగల్ జిల్లాలో రాడికల్ ఉద్యమంపై మొట్టమొదటి వ్యాసం ఎకనామికల్ అండ్ పొలిటికల్ వీక్లీకి వ్యాసం రాశారు. హైదరాబాద్ బుక్ ట్రస్టు కోసం డిడి కోశాంబీని పరిచయం చేస్తూ పుస్తకం రాశారు. ఆర్ఎస్ సుదర్శనం, త్రిపురనేని మధుసూధనరావు 'మార్క్సిజం – సాహిత్యం'పై ప్రమాణిక విమర్శ రాశారు. 'పాంటియర్'లో మాభూమి – శంకరాభరణం వంటి సినిమాలతో పోలుస్తూ వ్యాసాలు రాశారు. ప్రజాతంత్ర దిన,వార పత్రికలకు ఆయన రెగ్యులర్ కాలమ్స్,వ్యాసాలు రాస్తుండేవారు. ప్రజాతంత్ర వారపత్రికలో 200 వారాల పాటు వివిధ విషయాంశాలు,సమకాలీన వ్యవహారాలపై నిశిత దృష్టితో చురుకైన విమర్శలు చేస్తుండేవారు. ఈ వ్యాసాలపై సర్వత్రా చర్చ కూడా జరిగేది. సృజనలో 'కల్లోల కథా చిత్రాలు' రచించారు. ఒక సామాజిక వ్యాఖ్యాతగా ఎకనామికల్ అండ్ పొలిటికల్ వీక్లీలో ఇంగ్లీష్ వ్యాస సంకలనం ఆయన్ను విప్లవ రాజకీయార్థిక విశ్లేషకునిగా దేశంలో ఎన్నదగిన వారిలో ఒకరిగా నిలిపింది. ❋

## పోరాటాలు



ఉద్యమాలకు బాలగోపాల్‌కు అత్యంత ఆత్మీయమైన అనుబంధముండేది. ఉద్యమాలు కూడా ఆయన్ను అట్టి పెట్టుకునే వుండేవి. ఉద్యమాలకు దూరంగా ఆయన ఎన్నడూ వుండేది లేదు. ఉద్యమాల సమయంలో తనకు అడ్డుగా నిలిచిందని 1986లో కెయులో మాథ్స్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఒంటరిగానే పోరాటం చేశారు. ఆయన ఫలానా ఉద్యమానికి దూరంగా వున్నారన్నది లేదు. పేదలకు అన్యాయం జరుగుతుందని తెలిసిన మరుక్షణమే అక్కడ ఆయన ప్రత్యక్షమై,ఉద్యమానికి శ్రీకారం చుట్టేవారు. ఇళ్ల మీద పోలీసు దాడులు, అక్రమ అరెస్టులు, చిత్ర హింసలు, పోలీసు క్యాంపులు, బై డోవర్లు, గృహ దహనాలు, అత్యాచారాలు, స్త్రీలపై లైంగిక హింస వంటి పోలీసు దాడులు, రాజ్యహింస గురించి మాత్రమే కాదు. కూలిరేట్లు, కుల వివక్ష,వ్యభిచార గృహాలకు స్త్రీలను అమ్మడం, వరకట్న హత్యలు, దేవాలయాల్లో బ్రాహ్మణేతర స్త్రీ పూజారి కొనసాగే హక్కు, వర్షానికి చితికిన బతుకులు, కెయులో రిజర్వేషన్లు, విద్యాలయాల్లో విద్యార్థి సంఘాల అవసరం వంటి వాటిపై ఆయన రాజీలేని పోరాటాలను నడిపారు. నోరులేనివాళ్లకు స్వరబలం, పేరులేని వాళ్లకు చిరునామా, ఆవాసం లేని వాళ్లకు కాళ్ల మీద నిలబడే స్వావలంబన, అసంఘటితంగా వున్న వాళ్లకు సంఘటన సమకూర్చడం ప్రజాస్వామిక హక్కుల ప్రాపంచిక దృక్పథం కావాలన్నది ఆయన అలోచన. ఇవేకాక సింగరేణి ఒపెన్ కాస్ట్ కార్మికుల బతుకులు,అభివృద్ధి పేరిట విస్థాపన, విధ్వంసం, పోలేపల్లి సెజ్‌లు, మహిళలు,దళితులు, ఆదివాసీలు, నిర్వాసితులు, భిన్న సామాజిక వర్గాల ఉద్యమాలతో ఆయన మమేకమయ్యారు. ఇప్పటికీ సింగరేణి ప్రజలు బాలగోపాల్‌ను మర్చిపోలేదు. ఎక్కడ ఉద్యమం మొదలైనా మొదటి వినిపించేది బాలగోపాల్ పేరే.. *

తెల్లవారు జామునే ఆయన బస్సుకు వెళ్లారు. అదీ ఆయన నిబద్ధత అంటే.. అదీ ఆయన చిత్తశుద్ధి. ఆయన ఏ పని చేసినా అంతే. ఆ పని పూర్తయ్యేవరకూ వెంట పడుతూనే వుంటారు. సింగరేణి బొగ్గు కార్మికులు, ఒపెన్ కాస్ట్ గనులకు వ్యతిరేకంగా నిర్వహించిన పలు ఉద్యమాల్లో బాలగోపాల్ ముద్ర వుంది. సెజ్‌లకు వ్యతిరేకంగా, ప్రత్యేకంగా పోలేపల్లి సెజ్‌కు వ్యతిరేకంగా బాలగోపాల్ ఉద్యమాన్ని సాగించారు. ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుంకు వ్యతిరేకంగా ఉద్యమాలను కూడా నిర్వహించారు.

మానవ హక్కులకు కొత్త అర్థాన్ని చెప్పిన బాలగోపాల్, ఉద్యమాలను తన భుజాన వేసుకొని మోసిన బాలగోపాల్ మరణించలేదు. ఆయన నడిపిన ప్రతి ఉద్యమం ఆయన్ను కలువరిస్తూ వుంటుంది. ప్రజాహక్కులు,మానవ హక్కుల కోసం ఆయన పోరాటస్ఫూర్తి ఎప్పుడూ నిలిచే వుంటుంది. ప్రజలకు, సామాన్యుడికి రాజ్యహింసను, రాజ్యాన్ని ప్రశ్నించడం నేర్పారు. హక్కుల విలువల్ని, హక్కుల గురించి విస్తృతమైన అవగాహన కల్పించి, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. అలాంటి స్ఫూర్తిదాయక నేతకు మరణం వుండదు. మరో మహాత్ముడిలా ఈ యుగం గౌతమ బుద్ధుడిలా నిలిచిపోతారు.

### సాహితీకారుడిగా...

బాలగోపాల్ ఒక వైపు ఉద్యమాల్లో కీలక భూమిక వహిస్తున్నప్పటికీ, ఆయన సాహిత్యాన్ని మరువలేదు. సాహిత్యమంటే ఆయనకు ఆసక్తి,ప్రేమ. గురజాడ నుండి ప్రపంచ సాహిత్యం ముస్లిం మైనార్టీ సాహిత్యం వరకు ఆయన అనర్ఘళంగా మాట్లాడగలరు. ఆయన మార్క్సిస్టు దృక్పథంతో సాహిత్య ప్రక్రియాలపై అనేక విమర్శల్ని చేశారు. అదే కోణం నుంచి సాహిత్యాన్ని పరిశీలించారు. మార్క్సిజంలో సాహిత్యం చర్చల్లో భాగంగా ప్రామాణిక వ్యాసం రాశారు. పాంటియర్ పత్రికలో సినిమాలపై విమర్శనాత్మక వ్యాసాలను రాశారు. విప్లవ రచయితల సంఘంలో ఆయన చేరి,ఆ క్రమంలో జరిగిన అనేకానేక సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆ మధ్య కాలంలో ఆయన ప్రసంగం లేని విరసం సాహిత్యశాల (సభ) లేదంటే అతిశయోక్తికాదేమో. ఆ తర్వాత సృజన- సాహితీ మిత్రులులో బాలగోపాల్ చేరారు.1992 వరకు విరసంలో విస్తృతంగా పనిచేశారు. బాలగోపాల్‌కు చరిత్ర, రాజకీయార్థ శాస్త్రం, అన్నింటికి మించి సమకాలనీత మీద వున్న పట్టు వాస్తవిక దృష్టి, భాష, శైలి, సాహిత్య విమర్శకు పుష్టినిచ్చాయి. బాలగోపాల్ తాతగారైన రాళ్లపల్లి కృష్ణ అనంతశర్మ నుంచి వ్యంగం, మృదువైన హాస్యం చురుకుదనం, కనువిప్పు తదితర అంశాలన్నీ బాలగోపాల్‌లో కనిపిస్తాయి. సాహిత్యం మీదప్రేమ ఎక్కువ. నన్నయ నుంచి గురజాడ - దళిత, స్త్రీవాద ముస్లిం మైనార్టీ సాహిత్యం వరకూ క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. నక్సల్బరీ - ఉద్యమం - గమ్యం, చీకటిరోజులు అనే పుస్తకాన్ని రచించారు. ఢిల్లీలో జెఎన్‌టియులో పీహెచ్డీ చేస్తున్నప్పుడు అంతర్జాతీయ గణిత శాస్త్ర పత్రికలకు సంపాదకత్వం వహించారు. ప్రాపంచిక దృక్పథం కోసం రస్సెల్ నుంచి కోశాంబి దాకా అధ్యయనం చేశారు. కవిసేన మేనిఫెస్టో మీదే కాదు.. యండమూరి వీరేంద్రనాథ్ తులసీ,తులసీదళం మీద, కొడవటిగంటి కుటుంబరావు యుద్ధ కాలపు కథలమీద సాహిత్య విమర్శ మీద వ్యాసాలు రాశారు. వీటిని స్నేహ ప్రచురణల పేరిట డాక్టర్ కరుణ 'రూపం-సారంగా' ప్రచురించారు. *

# చెకుముకీ!

○ వఝల శివకుమార్



జీవితాన్ని
ఆచరణాత్మక చరణం చేస్తూ
ఒక ప్రశ్నగా
ఒక ప్రమాణంగా
ఒక ప్రయాణంగా
బతికిన వాడా
నీ పాద ముద్రల్ని
దారులన్నీ బీజాలుగా చల్లుకుంటాయి.

నిలదీసే సాహసాన్ని
నిగ్గదీసే నైజాన్ని
రాజీ పడని తత్వాన్ని
అడుగడుక్కీ రంగరించి పోసినందుకు
ఈ నేల నీకు రుణపడి ఉంది.

మనిషి కోల్పోతున్నదేంటో
మట్టి పోగొట్టుకుంటున్న దేంటో
నెత్తుటిని మరిగిస్తున్న దేంటో
తెలుసుకునే అన్వేషణలో
నిజాల నిప్పుల్ని భుజాన వేసుకొచ్చే
చెకుముకీ!
నీ చూపునించే
ఉద్యమాలు ఊపిరి నింపుకున్నాయి
పరిష్కారాలు ప్రాణం పోసుకున్నాయి.

హక్కుల కంఠ నాళాల్ని
వ్యవస్థల అదృశ్య హస్తాలు
నొక్కినప్పుడల్లా
గొంతుకనిచ్చి విచ్చి మ్రోగిన
స్వర భాస్వరానివి నువ్వు
చీకటి కోణాల్ని
బహిరంగ పరచే భాస్కరునివి నువు

మూగవేదనలకు అద్దం పడుతూ
ఒక కరపత్రంగా
నువ్వు అవతారమెత్తినప్పుడల్లా
తడిమిన కళ్ళన్నీ
ఆలోచనల కొలుములైన దాఖలా

పడికట్టు సిద్ధాంతాల లోపాలనించి
సాఫల్య కోణాలు సూత్రీకరించిన
వాస్తవ దృక్పథం నీది
లోభాలకూ ప్రలోభాలకూ లొంగని
బెదిరింపులకూ దాడులకూ వెరవని
నీ నడక, నీ లక్ష్యం
దారి తప్పుతున్న వాళ్ళకి
ఓ పునర్మూల్యాంకన సూత్రం
అడుగులకి అంతర్నేత్రం

దేహానికి మోహాలకీ అతీతంగా
వజ్ర సంకల్పమై తెగబడిన వాడి చేతిలో
మరోసారి మరణం ఓడిపోవడం
ఓ చారిత్రక వాస్తవమైంది.... ■

# ఖాళీల మధ్య మనిషి

○ వేముగంటి మురళీకృష్ణ

రక్తంతో తడిసిన నేల మీద నిలబడడం
మాటలన్నింటిని కరపత్రాల్లోకి వంపి
పావురంల్లా ఎగిరిపోతున్న హక్కుల్ని సాధించడం
ఒక సందర్భం
సూక్ష్మ అద్దాల చూపులతోని



వాడ వాడలా తిరిగి
గోడకు అంటించిన పోస్టర్‌లా
పేద జీవితాల్లో అల్లుకుపోయి
నిద్రలేని కండ్లను మూయలేక
రాత్రనకా, పగలనకా తిరిగే ఒంటరి మానవ పరిమళం

ఓదార్చే చేతులతో
వంగిపోని నడకతో
కొన్ని లోలోతుల మధ్య కదులుతూ
ఖాళీలను గురించి మాట్లాడడం
ఒక సాహసం
వ్యక్తులకూ వ్యక్తులకూ మధ్య అంతరంగాల్లో అంతర
దొంతరలు
పేరుక పోయినప్పుడు
మాటలతోనైనా కలెబడడం ఒక నిజాయితీ
కమిలిపోయిన వీపులకు హక్కుల కమలంతో మందును రాసి
లాఠీని ప్రశ్నించడం ఒక్క అతనికే తెలుసు
చావును చంకలో పెట్టుకున్న పేపర్‌లా చుట్టుకొని
ఓపెన్ కాస్ట్ విధ్వంసంలోకి
సెజ్ మట్టికాళ్ల మహారాక్షసి ముఖంలోకి
ఆకలి జ్వరాల గోండు గుడిసెల్లోకి
రాళ్ళుళ్ళ నుంచి, మంచు రక్తపు ముద్దల కొండల్లోకి
ఆది వాసీ ఆర్తనాదాల గొంతుల్లోకి నినాదంలా జారి
ఎటు గాయాల్లోకి గాలి కదిలితే
అటు కదిలే హక్కుల పతంగి అతడు
మునిగిపోయిందా, ముడుచుకపోయిందా హక్కుల కాగితం
అచేతనంగా అద్దాల వెనక కను రెప్పల్ని మూసేసిందా
శరీరం మీద హక్కును కోల్పోయి
చితి మంటల మధ్య మౌనంగా నిలబడ్డ దొక
నిరాకార ఊహ
ఒక హక్కుల సందర్భం
ఒక ఖాళీల సందర్భం
నిలువెత్తు మానవీయ స్పర్శ కోల్పోయిన
మట్టి దు:ఖపుపాటకు స్వచ్ఛమైన వీడ్కోలు
పలుకుతున్నది. ■

# అవిశ్రాంత హక్కు

○ దాసరాజు రామారావు

బాలుడా గోపాలుడా కాదు
ఆ బాల గోపాలుడు
హక్కు ప్రసవించిన ఉద్యమ సాహసి
తలమాసిన ఆలోచనల ఊట పవిత్రమే - పరిమళమే
బనీనులేని ముతక అంగీ మనో సంకల్పానికి
వజ్ర కవచమే
నాలుగు మూలల దొడ్డు కళ్ళద్దాలు
నీతి మాలిన ప్రపంచ పోకడలను వడకట్టడమే
చలవ పందిరి ఉద్యోగం
ఎడమ చేత్తో విసిరి



నలుపు చట్టాలపై ఫోకస్ చెక్కై
ముళ్ళ కోటు సహవాసం
సూర్యుడికి అలసిన క్షణం ఉంటదేమో
గాలికి చేరని చోటు ఉంటదేమో
మిమ్ముల పోల్చడానికి వస్తువేది సార్
కవి తడబడుతున్నాడు
గద్గద పడుతున్నాడు
మనిషి ఎలా తయారైతడు
రక్తమాంసాలతోనా – జనం కన్నీళ్ళతో
హక్కుల భంగపాటులోంచి
ఎగజిమ్మిన అనర్గళ వాక్ జలపాతమై – మీలా
మానవ జాతి ఎక్కడ
అని పరిశోధన చేస్తే
నీ చిరునామాలో మీరుండరుగా!
జేబులోంచి మీ ఫోటో తీసి చూపడమే మాకు దక్కింది
వాకపల్లి సిగ్గులను వెలివాడగా దోచినా
గుడిసె బతుకులను
తాటాకుల్లా విసిరేసినా –
చేతుల్లోని పని బువ్వను గుంజేసినా
భయకంపిత ఎన్‌కౌంటర్ ఘటన సృష్టించినా
'అన్యాయమో బాలగోపాలా' అని మొరపెడితే
నిద్ర దుప్పటి దులిపేసి
మబ్బులనే రోడ్డు ప్రత్యక్ష్యం
సార్, ఖాళీలను పూరించాలన్నారు
హక్కులకు విస్తృత అర్థాలు కలిపి
పొలిమేరల చెరిపినరు
ప్రతి హక్కు చుట్టు గౌరవప్రదమైన కంచె కూడా నాటినరు.
సారు చెప్పిన మక్కుల చట్రంలో
ప్రాణికి జీవించే హక్కు ఉన్నది కదా
అర్ధాంతరంగా దాన్ని కొట్టి వేసే
హక్కు ఎవ్వరికి ఉండకూడదు కదా
మామూలు ఎక్కిళ్ళతో మొదలైతే
మరణం తుది అంచుదాకా
మిమ్మల్ని లాక్కెళ్ళిన మృత్యువుపై
కోసితీరా కేసు పెడ్తం
మీరు వాదించాలె
వింటున్నారా సార్ ■

# రేపటి వెలుతురు

**○ సిహెచ్. మధు**



గుండె నిండార కన్నీరు పొరలు పొరలుగా
కమ్ముకొస్తున్నప్పుడు
కవిత్వం రాయడం కష్టమే
బాలగోపాల్ జనం కన్నీళ్లు తుడిచే ఆత్మీయ వర్షం
నేనున్నానంటూ పరుగెత్తుకచ్చే ఓ యోధుని స్వరం
చిక్కటి చీకటి తుఫాను రాత్రి
ఓ మెరుపు తార
ఓ వెలుగు రేఖ రాలిపోయింది
ఇప్పుడెవరు ఈ చీకట్లో దీపం పెడతరు
జనం ఓటుతో జనాన్ని వేటాడుతున్న మృగాల
ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్న వేళ
హక్కుల సూర్యుడు అస్తమించాడు
సెజ్‌ల జనం బతుకులను జీరో చేసినప్పుడు
వ్యవస్థను ప్రశ్నించిన వీరుడు
అకస్మాత్తుగా కనుమరుగయ్యాడు
అడవి పుత్రుల అంధకార గుండెలో
చిరు కిరణం కొరకు పోరాడిన వీరుడు నేలకొరిగాడు
పౌరహక్కులను ఆకాశం చేసి
అటు ఇటు ఒంటరిగా నిలబడి
నెత్తురోడుతున్న వ్యవస్థకు కొత్త భాష్యం చెప్పిన
మేధావి మాయమయ్యాడు

దశాబ్దం క్రితం పల్లెలకు కలిసి కదిలిన
నిజ నిర్ధారణ అడుగుల నీవూ నేనూ
నాస్మృతి పథంలో భద్రంగా ఆనాటి రోజులు
ఇప్పుడు చీకటి ఇంకా చిక్కనయింది
సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ, కార్పోరేట్ సంస్కృతి
జానాన్ని కాటు వేస్తున్న రోజులివి
జానానికి ముందూ వెనక నిల్చిన బాలగోపాల్
నేదు కిరణం రేపు వెలుగు. ■

# లోకానికి ఇచ్చిన నిర్వచనం

**ం పసునూరి రవీందర్**

ఎందరెందరో బతికే బతుకు

తన కొద్దనుకొని
లెక్కల పంతులు ఒకాయన
అన్ని వదులుకొని
హక్కుల జండై ఎగిరిందు
లెక్కలు
పేదల చిక్కుల ముడి విప్పలేవని
కొలువు
హక్కులు నిలువునా తగులబడ్డ నోరెత్తెనివ్వదని
చినిగిన చొక్కాను వదిలేసినట్టు
రాజ్యం ముఖాన కొట్టిపారేసాదు
బీద సాదల కోసం
తన ఊపిరినంతా ఉద్యమాలకు అంకితం చేసిందు
బతుకడమంటే
నలుగురి కోసం పాటు పడడమేనని
చావడమంటే
ఎవని కోసం వాడు చూసుకోవడమేనని
ఒక కొత్త నిర్వచనాన్ని లోకానికిచ్చిపోయిందు
అల్సర్– కడుపును గుల్ల చేసినా
రాజ్యం – కలల్ని ఛిద్రం చేసినా
ఆ చూపు కలత చెందలేదు
ఊరి తూరుపు గుట్ట
తుపాకుల మోతలల్ల
నిజమెంతో చెప్పే
పోస్ట్‌మార్టమే రిపోర్టయిందు
వాకపల్లి శోకాల గుట్టను
న్యాయస్థానానికీడ్చి
గుడ్డి న్యాయ దేవత కంటికి చూపునిచ్చిందు
ఇట్లా....!
అభాగ్యుల హక్కుల కోసమే పుట్టినోదు

ఎవరికీ చెప్పకుండా
చేస్తున్న పనిని
చేయాల్సిన పనుల్ని
తాను వెలుగించిన బతుకు దీపాలకిచ్చి
లోకం కోసం తపించే గుండెల్లో
శాశ్వతంగా జీవించడానికి
ఉత్త కాళ్ళతో నడిచి వెళ్ళిపోయిందు ■

**(బాలగోపాల్ స్మృతిలో..)**



# పావురం

అన్నవరం దేవేందర్



ఇల్లు ఇజారం
పొయ్యి గుజారం
కాళ్ళకు గిర్కలు కట్టినట్టు ఒకటే తిరుగుడు
పెయ్యిమీద సోయి లేని మనిషి
లోకం కోసం తపించిన సంచారి.

ఆయన మాట జూటా గాళ్ళకు తూటా
ఆయన రాత కుటిల రాజ్యపు నోరుమూత
ఆయన వ్యాజ్యం ఆదివాసీ న్యాయం
మందందరి మనుగడే ఆయన జివునం

చదువుకున్న లెక్కలను లెక్క చెయ్యక
హక్కుల ఉద్యమాలకే హక్కుదారుడయిండు
న్యాయం కోసం పోరాగానోలె గాయిగాయి
కలెబడి నిలబడి ఎగబడుడు
అడుగుడు తెలుసుకునుడు అగ్గి రాజేసుడు
సకల ఉల్లంఘనలపై పెంచిన చైతన్యం
జీవితం పోరాటం ఆచరణ మీద నిలకడ
ఆయన మన బాల గోపాల్
స్వేచ్ఛకోసం పరితపించిన పావురం. ■

# తలెత్తుకున్న ప్రశ్నల గొంతు

తైదల అంజయ్య

బతుకు ముఖ్యం
సారంగా బతకడం యింకా ముఖ్యం.
అసత్యాలను నిరాకరిస్తూ బతకడం మరీ ముఖ్యం.
నిన్నటిని నిరాకరిస్తూ రేపటికి అడుగిడిన వాడు
అత్యంత ప్రియమైన వాటినీ నిరాకరిస్తాడు
ఆ విధంగా ప్రాణాన్ని కూడా!
అతడు మనిషిని ప్రేమించినవాడు
అసలు ప్రశ్నెక్కడ పుట్టిందనుకుంటాం?
అజ్ఞానం నుంచా? అమాయకత్వం నుంచా?
కాదు, కాదు ఒక నిరాకరణ వద్ద ప్రశ్న పుడుతుంది.
సమస్త ప్రపంచాన్ని ధిక్కరించే
సామాజిక వర్గం సమీకరణాన్ని సాధించినవాడా!
రాజ్యం భయానికి తలవంచుకుని నడిచే



శిరస్సుల మీద ప్రశ్నలు మొలిపించిన వాడా!
నువు సృజించిన ప్రశ్నేమవుతుంది?
ఆకలి కేకవుతుంది.
అమాయకుని చేతిలో అస్త్రమవుతుంది.
బొగ్గు పొరల్లో రగిలే అగ్ని కణమవుతుంది.
పిచ్చి మృత్యువా!
నిన్ను నిరాకరించి లాఠీని ప్రశ్నించిన వాడు కదా!
చరిత్రలో ప్రశ్నకెపుడైనా మరణముంటుందా? ■

**(బాలగోపాల్‌కు జోహార్లతో....)**



# మానవ హక్కుల పరిస్థితిపై

## జనవరి 3, 1990 లో

## 'నిగాహ్' శీర్షికలో బాలగోపాల్

"మానవ హక్కులు అనేది విశాలమైన రంగం. ఒక సంవత్సర కాలంలో అందులో వచ్చిన మార్పులను సమీక్షించాలంటే సులభం కాదు. ముఖ్యమైనవి మాత్రం ప్రస్తావించి వదిలి పెడదామంటే ఏవి ముఖ్యం, ఎవరికి ముఖ్యం అన్న ప్రశ్న వస్తుంది....

దీనిని చాలా రకాలుగా వ్యాఖ్యానించుకోవచ్చు. అసలు అందరూ మాట్లాడే న్యాయబద్ధమైన మాటలలోనే నిజాయితీ లేదని కొట్టి పారేయొచ్చు. ఇందులో కొంత నిజం ఉండవచ్చును గాని ఇది పూర్తి సత్యం కాదనుకుంటాను. సామాజిక న్యాయం విషయంలో బాధిత ప్రజాసమూహాల నుండి నిజమైన ఒత్తిడి సమాజం మీద ఉంది. దానికి లభించే స్పందనంతా బూటకం అనుకోవడం సబబుకాదు. మరి ఏ విధంగా అర్థం చేసుకోవాలి? మానవ హక్కులు, ప్రజాస్వామ్య విలువల కోణం నుండి చూసినప్పుడు దీనికొక వ్యాఖ్యానం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. సమాజంలో విస్తృతంగా ప్రచారం పొందిన భావాలు ఎంత త్వరగా వ్యవస్థిత నియమాలుగా మారుతాయనేది ఒక ప్రజాస్వామ్య వ్యవస్థకుండే బలాన్నీ, దాని 'మెచ్యూరిటీ'ని సూచిస్తుంది. ఇది రాజకీయ ప్రజాస్వామ్యానికే కాదు, సాంఘిక జీవితంలో ప్రజాస్వామ్య సంస్కృతికి కూడా వర్తిస్తుంది. ఈ అర్థంలో మనది రాజకీయంగానూ సాంఘికంగానూ కూడా చాలా బలహీనమైన ప్రజాస్వామ్యం. ఇక్కడ 'ప్రజాభిప్రాయం' అనే దానితో నిమిత్తం లేకుండా నడుచుకోవడం, నడుచుకొని సాగించుకోవడం చాలా సులభం. పోలీసులూ ప్రభుత్వ అధికారులే కాదు, రాజకీయ పార్టీలు, న్యాయస్థానాలు, ఉద్యమాలు, కళాకారులూ అందరికీ అన్నిటికీ ఇది సాధ్యం."

'ప్రజాతంత్ర'లో బాలగోపాల్ రాసిన 200 వ్యాసాలలోని కొన్ని అభిప్రాయాలను, ఆలోచనలను ఆయన స్మృతిలో ఒక సంవత్సరకాలం పాటు ప్రతి వారం పాఠకులకు అందిస్తున్నాం. ఆ మహోన్నత మానవతావాది పై మీ అభిప్రాయాలను, అనుభవాలను వ్యాసరూపంలో, కవిత రూపంలోగాని లేక ఏదైనా అరుదైన ఫోటోలు ఉంటే మాతో పంచుకోండి.

-ఎడిటర్


# ప్రజాతంత్ర

తెలంగాణ దినపత్రిక

నిష్పాక్షికతకు నిలువుటద్దంగా నిలిచిన 'ప్రజాతంత్ర' వారపత్రిక పాఠకుల ఆదరాభిమానాలను విశేషంగా చూరగొన్నది. పాఠకుల అభిమానమే పెట్టుబడిగా అప్రతిహతంగా పురోగమిస్తున్నది. అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చిన 'ప్రజాతంత్ర' తన ప్రస్థానంలో ఎన్నో మలుపులు దాటింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుని, అన్ని హంగులతో చక్కని గెటప్‌తో వెలువడుతున్నది.

**చందా వివరాలు :**

| | | |
|---|---|---|
| సంవత్సరం | - | రూ . 250/- |
| 6 మాసాలు | - | రూ . 125/- |
| విడి ప్రతి | - | రూ . 5/- |
| జీవిత సభ్యత్వం | - | రూ . 2500/- |

**చిరునామా :**
మార్కెటింగ్ మేనేజర్,
'ప్రజాతంత్ర' వారపత్రిక
ఇం.నెం.12-1-62,
విజయా గార్డెన్స్,
బండ్లగూడ, నాగోల్
రంగారెడ్డి జిల్లా - 500068.
ఫోన్ : 20050456.

**చందాను 'ప్రజాతంత్ర' పేరుమీద డి.డి.గాని, చెక్కుగాని పంపించండి. ఇతర ప్రాంతాలవారు చెక్కుకు అదనంగా 10 రూ॥ పంపగలరు.**

# ప్రజల ఆశలు నెరవేర్చడమే వై.యస్. ఆశయం...
# ఆ ఆశయసాధనలోనే ఈ ప్రభుత్వ పయనం




ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని కాపాడుకోవడానికి, తన పాలనపై పెంచుకున్న ఆశల్ని నెరవేర్చడానికే కీ॥శే॥ వై.యస్. రాజశేఖరరెడ్డి తన అంతిమ ఘడియల్ని సైతం అంకితం చేశారు. అటువంటి ప్రజా నాయకుడి మానస పుత్రికలు ఈ సృజనాత్మక, వినూత్న పథకాలు. చివరి లబ్ధిదారునికి ప్రయోజనం కలిగించేవరకూ ఈ పథకాలను కొనసాగించడమే ఈ ప్రభుత్వ లక్ష్యం. వై.యస్. ఆశయాలను సజీవంగా ఉంచుతూ దిగ్విజయంగా అమలవుతోన్న పథకాలు ఇవే.





### రైతులకు ఉచిత విద్యుత్

- ఉచితవిద్యుత్ సరఫరా సమయం రోజుకు 7 గంటల నుండి 9 గంటలకు పెంపు



### జలయజ్ఞం

- కోటి ఇరవై లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం
- నేటికి 19లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం పూర్తి



### రాజీవ్ ఆరోగ్య శ్రీ

- తెల్లకార్డ్ అర్హత - 942 వ్యాధులకు వర్తింపు
- ఇప్పటి వరకు 3.71 లక్షల మందికి శస్త్ర చికిత్సలు



### అభయహస్తం
(ఐ.కె.పి. జీవిత బీమా పథకం)

- 90 లక్షల మందికి 2009 నవంబరు 1వ తేది నుండి బీమా బాండ్ల పంపిణీ



### ఇందిరమ్మ ఇళ్ళు

- మొత్తం 80 లక్షల ఇళ్ళ నిర్మాణం లక్ష్యం
- రెండు విడతలుగా 46 లక్షల ఇళ్ళ నిర్మాణం పూర్తి



### కిలో రెండురూపాయల బియ్యం

- 2 కోట్ల కుటుంబాలకు లబ్ధి
- నెలకు 3.92 లక్షల టన్నుల బియ్యం పంపిణీ



### పావలావడ్డీ

- రాష్ట్రంలోని ప్రతి మహిళనూ లక్షాధికారిని చేయడం లక్ష్యం
- ఇప్పటిదాకా 7.30 లక్షల మహిళా సంఘాలకు 13వేల కోట్ల రూపాయల రుణాల పంపిణీ



### ఇందిరమ్మ పింఛన్లు

- రాష్ట్రవ్యాప్తంగా 71,80,000 మందికి పింఛన్లు



### గ్రామీణ ఉపాధి హామీ

- ఇప్పటివరకూ రూ. 7462.17 కోట్ల వేతన చెల్లింపులు
- 149.73 లక్షల మందికి ప్రయోజనం


జారీ చేసినవారు: సమాచార, పౌర సంబంధాల శాఖ